# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...








సంపుటి : 2 | సంచిక : 256 | ఆదివారం 31 మార్చి 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




# కొనసాగుతున్న నేతల ఎత్తిపోతల పథకం!

- తెలంగాణలో నీటి ఎత్తిపోతల పథకాలు ఎండిపోతున్నా..
- నేతల ఎత్తిపోతల ప్రాజెక్టు మాత్రం కళకళలాడుతోంది.
- పార్టీ మార్పు వార్తలపై స్పందిస్తూ పెద్ద పెద్ద సవాళ్లు చేస్తున్న నేతలే.. షాక్‌లమీద షాక్‌లు ఇస్తున్నారు
- తెల్లారితే కాంగ్రెస్ కండువానో, కాషాయ కండువానో కప్పుకుని కనిపిస్తున్నారు
- ఇలా ఫ్యామిలీ ఫ్యామిలీలు ఇప్పుడు కాంగ్రెస్ జట్టులోకి చేరడంతో కాంగ్రెస్ మరింత బలంగా తయారవుతోంది
- లోక్‌సభ ఎన్నికల వేళ..ఇది కచ్చితంగా బీఆర్ఎస్‌ను దెబ్బదీసే తంత్రమే

*అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన దగ్గరి నుంచి గులాబీ పార్టీ పరిస్థితి రోజు రోజుకు దిగజారుతోంది. తెలంగాణలో నీటి ఎత్తిపోతల పథకాలు ఎండిపోతున్నా.. నేతల ఎత్తిపోతల ప్రాజెక్టు మాత్రం కళకళలాడుతోంది. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. చేరడమే కాదు దానంకు సికింద్రాబాద్ ఎంపీ టికెట్ కూడా కేటాయించింది. కష్టమొచ్చినా నష్టమొచ్చినా కేసీఆర్ వెంటే నడుస్తాం.. పార్టీ మారే ప్రసక్తే లేదు.. అసలు ఆ అవసరమే లేదు.. అంటూ పార్టీ మార్పు వార్తలపై స్పందిస్తూ పెద్ద పెద్ద సవాళ్లు చేస్తున్న నేతలే.. తెల్లారితే కాంగ్రెస్ కండువానో, కాషాయ కండువానో కప్పుకుని కనిపిస్తూ.. షాక్‌లమీద షాక్‌లు ఇస్తున్నారు. పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ వెంకటేష్ నేతతో మొదలైన వలసల ప్రవాహం.. మెల్లమెల్లగా ఊపందుకుని.. ఇప్పుడు జోరుగా నడుస్తోంది.*

-3లో




## ఆ పార్టీ మోసాలు బయటకు వస్తున్నాయి




- గత కేసీఆర్ పాలనలో బడుగు బలహీన వర్గాలకు ఏమి న్యాయం చేశారో చెప్పాలి
- మీరే అన్ని ముఖ్యమైన పదవులు చేపట్టి కల్లబొల్లి మాటలు మాట్లాడుతున్నారు
- బలహీన వర్గాలకు ఏమి చేశారో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్
- 16 కులాలకు కార్పొరేషన్లు కేటాయించాం
- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్

గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన మోసాలు అన్ని బయటకు వస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం నాడు గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... గత కేసీఆర్ పాలనలో బడుగు బలహీన వర్గాలకు ఏమి న్యాయం చేశారో మాజీ మంత్రి కేటీఆర్ చెప్పాలని ప్రశ్నించారు. మీరే అన్ని ముఖ్యమైన పదవులు చేపట్టి కల్లబొల్లి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బలహీన వర్గాలకు -మిగతా3లో




## కాంగ్రెస్‌కు మరో రెండు 'ఐటీ' నోటీసులు

- కాంగ్రెస్ పార్టీని వెంటాడుతోన్న ఆదాయపన్ను శాఖ
- రూ.1800 కోట్ల మేర ఆదాయపన్ను రికవరీ నోటీసులు అందుకున్న కాంగ్రెస్ పార్టీకి తాజాగా మరో రెండు నోటీసులు
- ట్యాక్స్ టెర్రరిజానికి కాంగ్రెస్ టార్గెట్‌గా మారిందని జైరామ్ ఫైర్

## రైతుల చెంతకు కేసీఆర్

- నేటి నుంచి జిల్లాల పర్యటనకు కేసీఆర్
- ఎండిపోయిన... దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించనున్న కేసీఆర్
- నేడు నల్గొండ, జనగామ, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించనున్న బీఆర్ఎస్ అధినేత
- ఉదయం నుంచి సాయంత్రం వరకు బిజీబిజీ
- రోడ్డు మార్గంలోనే ప్రయాణించనున్న కేసీఆర్



నల్గొండ


రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భ జలాలు అడుగంటిన వేళ.. చాలా చోట్ల పొట్ట దశకు వచ్చిన పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో రైతన్నల దిగులును తగ్గించి వారిలో భరోసా నింపడానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగనున్నారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రేపటి నుంచి జిల్లాల్లో పర్యటించనున్నారు. సాగునీరు అందక ఎండిపోయిన పంటలను... అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, రైతులను పరామర్శిస్తారు. బీఆర్ఎస్ అండగా ఉంటుందని వారికి భరోసా కల్పిస్తారు. ఆదివారం నుంచి ఆయన ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా పర్యటించనున్నారు. నేరుగా రైతుల వద్దకు వెళ్లి, వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకోనున్నారు. ఈ క్రమంలో ఆయన రైతులకు భరోసా, ధైర్యం కల్పించనున్నారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే ఈ పర్యటనలో కేసీఆర్ సూర్యాపేట, నల్లగొండ, -మిగతా3లో

## నాగాలాండ్‌లో ఎన్నికల బహిష్కరణ?

- నాగాలాండ్‌లోని ఒక వర్గం బహిష్కరిస్తున్నట్లు ప్రకటన
- రాష్ట్రంలోని ఆరు జిల్లాలను కలిపి ప్రత్యేక పరిపాలన కేంద్రం లేదా రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని ఎప్పటినుంచో ఈఎన్‌పీవో డిమాండ్
- నెరవేర్చని పక్షంలో రాష్ట్రంలోని ఏకైక లోక్‌సభ స్థానానికి జరిగే ఎన్నికల్లో పాల్గొనబోమని అల్టీమేటం

# మండుతున్న ఎండలు

- ఆ జిల్లాలకు ఎల్లో అలర్ట్
- సాధారణం కన్నా 3 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదు




హైదరాబాద్

తెలంగాణలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సాధారణం కన్నా 3 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కరీం నగర్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెదపల్లి, ఖమ్మం?, భద్రాద్రి, నల్గొండకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రేపటి నుంచి తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉందని, 40 డిగ్రీల కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్స్ ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా నమోదు అవుతున్నాయి. నేడు ఆదిలాబాద్ లో 43.3 డిగ్రీలు నమోదు అవ్వగా నల్లగొండ జిల్లా నాంపల్లిలో 43, గద్వాల్ 42.8, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దనోరాలో 42.7, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ తెలిపింది. కాగా ఏప్రిల్ -మిగతా3లో

# వావ్..మనవళ్ల ముందే... రికార్డులు బద్దలు కొట్టింది!

ఒక బామ్మ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టింది. మహిళల స్టమక్ ప్లాంక్స్‌లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు క్రియేట్ చేసింది. కెనడాలోని అల్బెర్టాకు చెందిన ఒక బామ్మ డోనాజీన్ వైల్డ్ ఏకంగా 4.5 గంటల పాటు పొత్తికడుపు ప్లాంక్స్ చేసింది. 2019లో కెనడియన్ డానా గ్లోవాకాతో గతంలో నెలకొల్పిన రికార్డు కంటే కేవలం 10 నిమిషాలు ఎక్కువ ప్లాంక్స్ చేసిన ఈ రికార్డును అధిగమించింది. గతంలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఉన్నత పాఠశాలలోనే డోనాజీన్ ఈ ఘనతను సాధించడం విశేషం. దీంతో స్కూలు విద్యార్థులు, తన 12 మంది మనవళ్ల కేరింతల మధ్య ఈ రికార్డు సాధించింది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది.గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అడ్జుడికేటర్ టీనా షి రికార్డును పరిశీలించారు. మొదటి రెండు గంటలు త్వరగానే గడిచిపోయాయని, కానీ తర్వాతి రెండు గంటలు చాలా కష్టంగా గడిచాయని, ఇక చివరి గంటలోచుక్కలు కనిపించాయంటూ తన అనుభవాన్ని పంచుకున్నారు డోనాజీన్. పదేళ్ల కఠిన ప్రాక్టీస్ తరువాత వరల్డ్ రికార్డ్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. విశేషం ఏమిటంటే ఆమె చేతుల్లో దీర్ఘకాలిక నొప్పి, తిమ్మిరితో బాధపడేవారు.





దీన్నుంచి బయటపడేందుకు ప్రతీరోజూ ఇచేయడం మొదలు పెట్టారట. డోనాజీన్ ప్రతిరోజూ మూడు గంటల పాటు ప్రాక్టీస్ చేసేదని, ఈ రికార్డులో భాగంగా దానిని ఆరు గంటలకు పెంచిందని చెప్పుకొచ్చారు ఆమె భర్త రాండీ.

# కాంగ్రెస్‌కు మరో రెండు 'ఐటీ' నోటీసులు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీని ఆదాయపన్ను శాఖ(ఐటీ) వెంటాడుతోంది. శుక్రవారమే(మార్చ్ 29)రూ.1800 కోట్ల మేర ఆదాయపన్ను రికవరీ నోటీసులు అందుకున్న కాంగ్రెస్ పార్టీకి తాజాగా మరో రెండు నోటీసులను ఐటీ శాఖ పంపిందని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ చెప్పారు. ఈ నోటీసులు శనివారం రాత్రి వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ట్యాక్స్ టెర్రరిజానికి కాంగ్రెస్ టార్గెట్‌గా మారిందని జైరామ్ ఫైర్ అయ్యారు. కాగా, 2017-18 నుంచి 2020-21 ఆదాయపన్ను అసెస్‌మెంట్ సంవత్సరాలకుగాను పెనాల్టీ, వడ్డీని కలిపి రూ.1800 కోట్ల పన్ను కట్టాలని శుక్రవారం ఇచ్చిన నోటీసులో ఐటీ శాఖ పేర్కొంది. నాలుగేళ్ల రిటర్న్స్‌పై రీఅసెస్‌మెంట్ ప్రొసిడింగ్స్ ప్రారంభించాలన్న ఆదాయ పన్ను శాఖ ఆదేశాలను కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఐటీ రికవరీ నోటీసులు పంపింది. 2014-15, 2015-16,2016-17 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఆదాయ పన్ను రిటర్నులను కూడా రీ అసెస్‌మెంట్ చేసే చర్యలు ఐటీ ఇప్పటికే ప్రారంభించింది. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఖాతాలో ఉన్న రూ. 135 కోట్ల మేర నగదును ఫ్రీజ్ చేసింది.




# తగ్గనున్న పారుబాకీలు..

దేశీయ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 2024-25 ఆర్థిక సంవత్సరంలో తగ్గనున్నాయని కేర్ రేటింగ్స్ నివేదిక అంచనా వేసింది. జీఎన్‌పీఏలు 2.1-2.4 శాతానికి పరిమితం అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎన్‌పీఏలు 2.5-2.7 శాతంగా ఉన్నాయని సంస్థ ఇటీవల విడుదల చేసిన నివేదికలో చెప్పింది. పారుబాకీలను ఎన్‌పీఏలుగా పేర్కొనడంతో పాటు, వాటికి తగిన కేటాయింపులు చేసి, వాస్తవ విలువలను చూపించాల్సిందిగా ఆర్‌బీఐ బ్యాంకులకు సూచించింది. ఈ చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని కేర్ రేటింగ్స్ తెలిపింది. అధిక వడ్డీ రేట్లు, నియంత్రణల ప్రభావం, ద్రవ్య లభ్యత, వాతావరణం, అంతర్జాతీయ సమస్యలు బ్యాంకుల జీఎన్‌పీఏలపై ప్రభావం చూపొచ్చనీ విశ్లేషించింది. 2013-14లో బ్యాంకుల జీఎన్‌పీఏలు 3.8% కాగా, 2015-16లో ఏక్యూఆర్ (ఆర్‌బీఐ ఆస్తుల నాణ్యతా పరిశీలన) కారణంగా 2017-18 నాటికి 11.2 శాతానికి చేరాయి. ఎన్‌పీఏలను గుర్తించడం, వాటిని పునర్‌వ్యవస్థీకరణ చేయడం లాంటివి చేపట్టడంతో చాలా బ్యాంకులు ఒత్తిడికి గురయ్యాయని పేర్కొంది. తదుపరి తీసుకున్న కఠిన చర్యల కారణంగా 2018-19 నుంచి జీఎన్‌పీఏలు తగ్గుముఖం పట్టాయి. 2022-23 నాటికి దశాబ్ద కనిష్ఠ స్థాయి 3.9 శాతానికి దిగి





వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికం చివరికి ఇవి 3 శాతం వద్ద ఉన్నాయని నివేదిక వెల్లడించింది. రంగాల వారీగా చూస్తే.. 2023 సెప్టెంబరు చివరకు వ్యవసాయ రంగంలో 7% జీఎన్‌పీఏలు ఉన్నాయి. పారిశ్రామిక రుణాల్లో 4.2%, రిటైల్ రుణాల్లో 1.3% జీఎన్‌పీఏలు ఉన్నాయని తెలిపింది.

## ఎన్నికల విధుల్లో ఎవరుంటారు? మినహాయింపు ఎవరికి?

దేశంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం పెద్ద సంఖ్యలో ఉద్యోగులకు వివిధ బాధ్యతలను అప్పగిస్తుంది. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, జాతీయ బ్యాంకులు, ఎల్‌ఐసీతో సహా వివిధ సంస్థల ఉద్యోగులు ఎన్నికల విధులలో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ పోలింగ్ బృందాలలో ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, సెక్టార్, జోనల్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, సహాయ వ్యయ పరిశీలకులు, డ్రైవర్లు, కండక్టర్లు, క్లీనర్లు మొదలైనవారు ఉంటారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల బాధ్యత రాష్ట్ర పోలీసులు, సెక్టార్, జోనల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులపై ఉంటుంది. వీరు వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని జిల్లాలలో ఎన్నికల నిర్వహణలో భాగస్వాములవుతారు. ఎన్నికల విధులలో నియమితులైనవారు గైర్హాజరయ్యేందుకు అవకాశం ఉండదు. విధులకు హాజరుకానివారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుంది. కేంద్రం లేదా రాష్ట్రంలో శాశ్వత ఉద్యోగులుగా ఉన్నవారిని మాత్రమే ఎన్నికల విధులలో నియమిస్తారు. అవసరమైతే పదవీ విరమణ తర్వాత డిప్యూటేషన్‌లో ఉన్న ఉద్యోగులను కూడా ఎన్నికల విధులలో నియమిస్తారు. కాంట్రాక్టు లేదా రోజువారీ ఉద్యోగులను ఎన్నికల డ్యూటీలో నియమించరు. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే ఎన్నికల విధుల నుంచి మినహాయింపు పొందవచ్చు. అటువంటి పరిస్థితిలో భార్యాభర్తలిద్దరికీ విధులు అప్పగించరు. దంపతుల్లో ఒకరు పిల్లలను లేదా వారి వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవడానికి మినహాయింపు కోరుతూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎవరైనా ?ప్రభుత్వ ప్రభుత్వ ఉద్యోగి అప్పటికే విదేశాలకు వెళ్లే ప్లాన్‌లో ఉంటే, అతను ఎన్నికల డ్యూటీ నుంచి మినహాయింపును కోరుతూ దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇందు కోసం ముందుగా ప్రయాణాన్ని బుక్ చేసుకోవాలి. దరఖాస్తులో ప్రయాణ రుజువుగా సంబంధిత టికెట్, వీసాను జత చేయాలి. ఇదేవిధంగా తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఎన్నికల విధుల నుంచి మినహాయింపును కోరవచ్చు.

## నాగాలాండ్‌లో ఎన్నికల బహిష్కరణ?



లోక్‌సభ ఎన్నికలను నాగాలాండ్‌లోని ఒక వర్గం బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. తూర్పు నాగాలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఈఎన్‌పీవో) రాష్ట్రంలోని ఆరు జిల్లాలను కలిపి ప్రత్యేక పరిపాలన కేంద్రం లేదా రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని ఎప్పటినుంచో డిమాండ్ చేస్తూవస్తోంది. వీటిని నెరవేర్చని పక్షంలో రాష్ట్రంలోని ఏకైక లోక్‌సభ స్థానానికి జరిగే ఎన్నికల్లో పాల్గొనబోమని తేల్చిచెప్పింది. ఈఎన్‌పీవోతో పాటు అపెక్స్ నాగా బాడీ, ఆరు జిల్లాల్లోని దాని అనుబంధ సంస్థలు ప్రత్యేక రాష్ట్రం కోరుతూ గత సంవత్సరం (ఫిబ్రవరి 27) అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిచ్చాయి. అయితే ఆ తరువాత ఈ విషయమై ప్రభుత్వం నుంచి హామీ వచ్చింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సలహాదారు ఏకే మిశ్రా అధ్యక్షతన ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు నాగాలాండ్‌ను అనేకసార్లు సందర్శించి, అక్కడి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. మరోవైపు నాగాలాండ్‌లోని తూర్పు ప్రాంత ప్రజలకు స్వయంప్రతిపత్తి ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి సిఫార్సు చేసిందని నాగాలాండ్ ముఖ్యమంత్రి నీఫియు రియో ?? ఇటీవల తెలిపారు. కాగా ఇఎన్‌పీవో ఇప్పటికే పబ్లిక్ ఎమర్జెన్సీని ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఏ పార్టీకి అనుమతి ఇవ్వబోమని తేల్చిచెప్పింది.

## రాజ్‌నాథ్ అధ్యక్షతన బీజేపీ మేనిఫెస్టో కమిటీ



**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా విడుదలలో ముందున్న భారతీయ జనతా పార్టీ కీలకమైన ఎన్నికల మేనిఫెస్టో కమిటీని శనివారం నాడు ఏర్పాటు చేసింది. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన 27 మందితో కమిటీని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటించారు. మేనిఫెస్టో కమిటీ కన్వీనర్‌గా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కో-కన్వీనర్‌గా పీయూష్ గోయెల్‌ను నియమించారు. కమిటీ ఇతర సభ్యులుగా ఇటీవలే ఎన్నికైన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ, కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్, అర్జున్ రామ్ మేఘ్వాల్, రాజీవ్ చంద్రశేఖర్, కిరణ్ రిజిజు, రాజీవ్ చంద్రశేఖర్, స్మృతి ఇరానీ తదితరులు ఉన్నారు. ఏడుదశల్లో జరిగే లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19న మొదలై జూన్ 1వ తేదీతో ముగియనున్నాయి. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

## ఎల్‌జేపీ లోక్‌సభ అభ్యర్థుల జాబితా విడుదల



**ఢిల్లీ:** రాబోయే ఎన్నికల్లో పోటీ చేయడానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విడతల వారీగా లోక్‌సభ అభ్యర్థుల జాబితాను ప్రకటించాయి. ఈ నేపథ్యంలో బీహార్ రాష్ట్రంలో ఉన్న రాష్ట్ర రాజకీయ పార్టీ 'లోక్ జనశక్తి పార్టీ' తమ అభ్యర్థుల జాబితా విడుదల చేసింది. ఎన్డీయే ప్రభుత్వంలో భాగమైన లోక్ జనశక్తి పార్టీ.. వైశాలి, హాజీపూర్, సమస్తిపూర్, ఖగారియా, జముయి స్థానాల్లో పోటీ చేయనుంది. దీనికోసం ఐదు మంది అభ్యర్థులతో కూడిన లిస్ట్ రిలీజ్ చేసింది. హాజీపూర్ నుంచి పార్టీ చీఫ్ 'చిరాగ్ పాశ్వాన్' పోటీ చేయనున్నారు. జముయ్ నుంచి అరుణ్ భారతి, ఖగారియా నుంచి రాజేష్ వర్మ, సమస్తిపూర్ నుంచి శాంభవి చౌదరి, వైశాలి నుంచి వీణాదేవిలను ఎన్నికల బరిలో దించింది. మార్చి 18న.. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ లోక్‌సభ ఎన్నికల కోసం బీహార్‌లో సీట్ల ఒప్పందాన్ని ప్రకటించింది. బీజేపీ 17 స్థానాల్లో, జేడీయూ 16 స్థానాల్లో, జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్థానీ ఆవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ ఒక్కో స్థానంలోనూ పోటీ చేయనున్నాయి. కాగా లోక్ జనశక్తి పార్టీ ఐదు స్థానాల్లో పోటీ చేస్తుంది.

## లిక్కర్ కేసు.. ఢిల్లీ మంత్రిని 5 గంటల పాటు విచారించిన 'ఈడీ'



**న్యూఢిల్లీ:** లిక్కర్ కేసులో ఆమ్‌ఆద్మీపార్టీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నీడలా వెంటాడుతోంది. ఇటీవలే ఈ కేసులో పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన ఈడీ తాజాగా ఢిల్లీ ప్రభుత్వంలోని మరో మంత్రి కైలాష్ గెహ్లాట్‌ను శనివారం(మార్చ్ 30) ఐదు గంటల పాటు విచారించింది. లిక్కర్ స్కామ్ సొమ్మును గోవా ఎన్నికల్లో ఆప్ పార్టీ ఖర్చు చేసిన విషయం తనకు తెలియదని గెహ్లాట్ ఈడీకి సమాధానమిచ్చినట్లు తెలిసింది. కాగా, రద్దయిన వివాదాస్పద లిక్కర్ పాలసీ 2021-22 రూపొందించడంలో కైలాష్‌గెహ్లాట్ కూడా కీలకంగా వ్యవహరించారు. లిక్కర్ పాలసీ రూపకల్పన కోసం ఏర్పాటు చేసిన ప్యానెల్‌లో గెహ్లాట్ సభ్యులుగా ఉన్నారు. లిక్కర్ పాలసీని అధికారికంగా వెల్లడించకముందే సౌత్ గ్రూప్‌నకు పాలసీ డ్రాఫ్ట్ లీకయిందని ఈడీ ఆరోపిస్తోంది. పాలసీ రూపొందిస్తున్న సమయంలో గెహ్లాట్ తన అధికారిక నివాసాన్ని వాడుకోవడానికి ఆప్ కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జ్ విజయ్‌నాయర్‌కు అనుమతిచ్చారని, ఇంతేగాక గెహ్లాట్ తన మొబైల్ నంబర్లను పదే పదే మార్చారని ఈడీ చెబుతోంది. విజయ్‌నాయర్ తన అధికారిక నివాసంలో ఉన్నాడన్న విషయాన్ని తాను ఒప్పుకుంటున్నట్లు గెహ్లాట్ తాజా విచారణలో ఈడీకి చెప్పినట్లు తెలిసింది.

## జమ్ము కశ్మీర్‌కు రేవంత్ రెడ్డి

**శ్రీనగర్ :** జమ్ము కశ్మీర్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనున్నారు. ఆ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో 27 మంది స్టార్ కాంపేయనర్లు పాల్గొన్నారు. అందుకు సంబంధించిన జాబితాను ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కే.సీ వేణుగోపాల్.. కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శికి శనివారం అందజేశారు. ఆ జాబితాలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతోపాటు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక వాద్రా, రేవంత్ రెడ్డి తదితరులు ఉన్నారు. ఇక కేంద్ర పాలిత ప్రాంతం జమ్ము కాశ్మీర్‌లో 5 విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 19న ఉదంపూర్‌లో.. ఏప్రిల్ 26న జమ్ములో.., మే 7న అనంతనాగ్, రాజోరీల్లో.., మే 13న శ్రీనగర్‌లో.., మే 20న బారాముల్లాలో జరగనున్నాయి. ఇక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4వ తేదీన జరగనుంది. అయితే జమ్ము కాశ్మీర్ లోక్‌సభ ఎన్నికల అనంతరం ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు.. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఆ రాష్ట్రంలో జరుగు తోన్న తొలి లోక్ సభ ఎన్నికలు. అయితే జమ్ము కశ్మీర్ ఓటర్ల నాడి ఎలా ఉందన్నది ఈ ఎన్నికల ఫలితాల సరళి బట్టి అర్థమవుతోందని రాజకీయ వర్గాల్లో ఓ చర్చ సైతం సాగుతోంది.


## సీపీఎం మొదటి లిస్ట్ విడుదల



రానున్న లోక్‌సభ ఎన్నికలకు సీపీఎం తమ అభ్యర్థుల మొదటి జాబితాను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం 44 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. చాలా రాష్ట్రాల్లో ఒకటీ రెండు స్థానాలకే అభ్యర్థులను ప్రకటించిన సీపీఎం.. కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఎక్కువ సీట్లకు తమ అభ్యర్థులను వెల్లడించింది. ఈ జాబితాలో అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లో 17 స్థానాలు ఉన్నాయి. కేరళకు చెందిన 15 మంది అభ్యర్థులు ఉన్నారు. ఇందులో అలప్పుజా నుంచి సిట్టింగ్ ఎంపీ ఆరిఫ్, వడకర నుంచి మాజీ ఆరోగ్య మంత్రి కేకే శైలజ టీచర్, కాజీకోడ్ నుంచి రాజ్యసభ ఎంపీ ఎలమరం కరీం ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని 17 పేర్లలో ముర్షిదాబాద్‌కు చెందిన మహ్మద్ సలీం పేరు కూడా ఉంది. ఈ జాబితాలో తమిళనాడుకు చెందిన ఇద్దరు అభ్యర్థులు ఉన్నారు. మధురై నుంచి సిట్టింగ్ ఎంపీలు ఎస్ వెంకటేశన్, దిండిగల్ ఆర్ సచ్చిదానందంలకు టిక్కెట్లు ఇచ్చారు. ఇక తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే తెలంగాణలోని భువనగిరి స్థానానికి ఎండీ జహంగీర్ పేరును, ఆంధ్ర ప్రదేశ్‌లోని అరకు స్థానానికి పాచిపెంట అప్పలనరస పేరును మొదటి జాబితాలో వెల్లడించింది.

# మండుతున్న ఎండలు..

-మొదటి పేజి తరువాయి



ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలో వడగాల్పులు వీస్తాయని.. హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఒకటవ తేదీన ఆదిలాబాద్, కుమురంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యపేట తోపాటు పలు జిల్లాల్లో అక్కడక్కడ వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. 2వ తేదీన ఆదిలాబాద్ కుమురంభీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, సూర్యపేట జిల్లాల్లో అక్కడక్కడ వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.వేసవి హీట్‌వేవ్‌ను అధిగమించడానికి అత్యంత కీలకమైన దశల్లో ఒకటి హైడ్రేటెడ్‌గా ఉండటం. చెమట ద్వారా కోల్పోయిన ద్రవాలను తిరిగి నింపడానికి రోజంతా నీరు పుష్కలంగా త్రాగాలి. మీ శరీరాన్ని చల్లగా,హైడ్రేట్ గా ఉంచడానికి కొబ్బరి నీరు, పండ్లతో కలిపిన నీరు లేదా హెర్బల్ టీలు వంటి హైడ్రేటింగ్ పానీయాలను ఎంచుకోండి. అధిక చక్కెర లేదా కెఫిన్ కలిగిన పానీయాలు నిర్జలీకరణానికి కారణం కావచ్చు కాబట్టి వాటికి దూరంగా ఉండండి.గాలి ప్రసరణను అనుమతించడానికి మరియు మీ శరీరాన్ని చల్లగా ఉంచడానికి కాటన్ లేదా నార వంటి శ్వాసక్రియ బట్టలతో తయారు చేయబడిన తేలికైన, వదులుగా ఉండే దుస్తులను ఎంచుకోండి. సూర్యరశ్మిని గ్రహించే బదులు ప్రతిబింబించే లేత రంగు దుస్తులను ఎంచుకోండి. వెడల్పాటి అంచులు ఉన్న టోపీ మరియు సన్ గ్లాసెస్ ధరించడం వల్ల కూడా సూర్యుని హానికరమైన కిరణాల నుండి అదనపు రక్షణ లభిస్తుంది.ఆరుబయట ఉన్నప్పుడు, సూర్యుని ప్రత్యక్ష వేడి నుండి తప్పించుకోవడానికి వీలైనప్పుడల్లా నీడను వెతకండి. రోజులోని నిర్దిష్ట సమయాల్లో, సూర్యుడు ప్రకాశవంతంగా లేనప్పుడు, మీ బహిరంగ కార్యకలాపాలను షెడ్యూల్ చేయండి. మీరు ఎండలో ఎక్కువ సమయం గడుపుతున్నట్లయితే, గొడుగులు, పందిరి లేదా పాప్-అప్ టెంట్‌లను ఉపయోగించి విశ్రాంతి కోసం మరియు వేడి నుండి ఉపశమనం కోసం షేడెడ్ ప్రాంతాలను సృష్టించండి.వేసవి హీట్ వేవ్ సమయంలో, తేలికగా, తేలికగా ఉండే రిఫ్రెష్ భోజనాన్ని ఎంచుకోండి, ఇవి సులభంగా జీర్ణమవుతాయి మరియు మిమ్మల్ని బరువుగా మార్చవు. మీ ఆహారంలో పుచ్చకాయ, దోసకాయలు మరియు సిట్రస్ పండ్లు వంటి అధిక నీటి కంటెంట్ ఉన్న పండ్లు మరియు కూరగాయలను పుష్కలంగా చేర్చండి. శరీర వేడిని పెంచే మరియు మీరు నిదానంగా భావించే భారీ, జిడ్డుగల ఆహారాలను నివారించండి.విపరీతమైన వేడిగాలుల సమయంలో, బహిరంగ కార్యకలాపాలను పరిమితం చేయడం ముఖ్యం, ముఖ్యంగా రోజులో అత్యంత వేడిగా ఉండే సమయంలో. వీలైతే, ఉదయం లేదా సాయంత్రం చల్లటి గంటలలో బహిరంగ వ్యాయామాలు లేదా పనులను షెడ్యూల్ చేయండి. మీ శరీరాన్ని వేడెక్కడం, అలసటను నివారించడానికి షేడెడ్ లేదా ఎయిర్ కండిషన్డ్ ప్రదేశాలలో సేద తీరండి.

# బీజేపీ ఎమ్మెల్యేలను టచ్ చేస్తే రేవంత్ ప్రభుత్వం కూలిపోతుంది

-మొదటి పేజి తరువాయి

48 గంటల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. బీజేపీ హైకమాండ్‌తో తెలంగాణ మంత్రులు టచ్‌లో ఉన్నారని మహేశ్వర రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహా ఐదుగురు మంత్రులు సంప్రదింపులు జరిపారని వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలతో సీఎం రేవంత్ రెడ్డికి నిద్ర కూడా పట్టడం లేదన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న వసూళ్ల చిట్టా మా దగ్గర ఉంది. హైదరాబాద్ డబ్బులు దేశ రాజకీయాల కోసం కాంగ్రెస్ వినియోగిస్తోంది. రంజిత్ రెడ్డిపై గతంలో రేవంత్ చేసిన ఆరోపణలు ఏమయ్యాయి. అప్పుడు రంజిత్ రెడ్డి అవినీతి చేశారని చెప్పిన రేవంత్ ఇప్పుడు ఎన్నికల్లో ఆయనకు ఓటు వేయాలని ఎలా అడగతారు?. రాష్ట్రంలో బీజేపీ ఎమ్మెల్యేలను టచ్ చేసి చూడండి ఏం జరుగుతుందో మీకే తెలుస్తుంది. మా పార్టీ గేట్లు ఎత్తితే 48 గంటల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదు. నితిన్ గడ్కరీ వద్దకు వెళ్లి షిండే పాత్ర పోషిస్తానని కోమటిరెడ్డి అన్నది వాస్తవం. అయితే, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై ఎవరికీ నమ్మక?ం లేదు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా ఆయనతో లేదు అంటూ కామెంట్స్ చేశారు.



### కోమటిరెడ్డి బ్రదర్ టచ్‌లో ఉన్నాడా..?

కాంగ్రెస్ పార్టీతో 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారనే మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలను మహేశ్వర రెడ్డి ఖండించారు. కోమటిరెడ్డి తమ్ముడు రాజగోపాల్ రెడ్డి టచ్‌లో ఉన్నాడో లేడో తెలుసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ చేత ఎందుకు విచారించడం లేదని మహేశ్వర రెడ్డి నిలదీశారు. రంజిత్ రెడ్డి భూములపై ఆరోపణలు చేశారు.. తర్వాత పార్టీలో చేర్చుకుని పక్కన కూర్చొబెట్టుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. టెలిఫోన్ యాక్ట్ కేంద్ర ప్రభుత్వానిది అయినందున ఆ కేసు సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

### 48 గంటలు


బీజేపీ ఎమ్మెల్యేల గురించి మాట్లాడే స్థాయి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లేదని మహేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. భువనగిరి ఎంపీ సీటును వెంకట్ రెడ్డి గెలిపించుకోవాలని సవాల్ విసిరారు. చేరికలకు సంబంధించి బీజేపీ గేట్లు తీస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 48 గంటలు కూడా ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ ఏక్‌నాథ్ షిండే పాత్ర పోషించడానికి చాలా మంది నేతలు ఉన్నారని హాట్ కామెంట్స్ చేశారు. రాజీనామా చేసిన తర్వాత ఈటల రాజేందర్ బీజేపీలో చేరారని మహేశ్వర రెడ్డి స్పష్టం చేశారు.

### కొత్తగా ఆర్ ట్యాక్స్

తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఆర్ టాక్స్ వసూల్ చేస్తున్నారని మహేశ్వర రెడ్డి ఆరోపించారు. ఆర్ అంటే రేవంత్, రాహుల్, రాజీవ్.. ఇందులో ఏ పేరుతో ట్యాక్స్ వసూల్ చేస్తున్నారో మాత్రం తెలియదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు రూ.1500 కోట్లు హైకమాండ్‌కు పంపించారని వివరించారు. మరో రూ.500 కోట్లు పంపించాల్సి ఉందని గుర్తుచేశారు.

# కడియంకు బీఆర్ఎస్ చెక్?

**హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాలని నిర్ణయించుకున్న సీనియర్ నేత కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియంపై అనర్హతవేటు వేసేందుకు సిద్ధమైన్లు సమాచారం. కేసీఆర్ సూచన మేరకు శనివారం మధ్యాహ్నం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం ఒకటి అసెంబ్లీకి చేరుకుంది. అయితే.. కడియంపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు పిటిషన్ ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రయత్నించారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ అందుబాటులో లేరని సమాచారం. దీంతో అసెంబ్లీ కార్యదర్శిని కలిసే యత్నం చేయగా.. ఆయన కూడా అందుబాటులో లేరని తెలుస్తోంది. దీంతో డిప్యూటీ సెక్రటరీకి ఇచ్చేందుకు ప్రయత్నించగా ఆయన స్వీకరించేందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. మరోవైపు కడియంపైన కాకుండా.. దానం నాగేందర్‌పై అనర్హత వేటు ఫిర్యాదు




చేసేందుకు ఈ బృందం వెళ్లినట్లు ప్రచారం నడుస్తోంది. దీంతో ఇద్దరిపైన లేకుంటే ఇద్దరిలో ఒకరిపైనే బీఆర్ఎస్ ఫిర్యాదుకు సిద్ధమైందా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే ఎవరి మీద అయినా.. ఆలస్యం చేయకుండా ఆయనపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను బీఆర్ఎస్ కోరనుందని సమాచారం. ఒకవేళ అనర్హత పిటిషన్‌ను స్పీకర్ స్వీకరిస్తే గనుక.. తదనంతర పరిణామాలు ఎలా ఉండబోతున్నాయా? అనే ఆసక్తి నెలకొంది. మరోపక్క శనివారం ఉదయం అనుచర గణంతో సమావేశమైన కడియం, ఆయన కూతురు కావ్యలు పార్టీ మారబోతున్నట్లు నిర్ణయం ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, పార్టీకి ప్రజలు దూరమవుతున్నారని, కారణాలు ఏవైనా బీఆర్ఎస్ ను ఇంకా ప్రజలు ఆదరించే పరిస్థితి లేదని కడియం శ్రీహరి చెప్పుకొచ్చారు. అందుకే తాము తప్పనిసరి స్థితిలో ఈ నిర్ణయం తీసుకుంటున్నామని అన్నారు. కావ్య తాను వరంగల్ ఎంపీగా పోటీ చేయబోతున్నానని.. తనను గెలిపించాలంటూ వ్యాఖ్యానించారు.

## రైతుల చెంతకు కేసీఆర్

-మొదటి పేజి తరువాయి



జనగామ జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించి, పంట పొలాలను పరిశీలించనున్నారు.

### కేసీఆర్ నేటి షెడ్యూల్ ఇదీ..

కేసీఆర్ ఆదివారం ఉదయం 8:30 గంటలకు ఎర్రవెల్లి ఫామ్ హౌస్ నుంచి జిల్లాల పర్యటనకు రోడ్డు మార్గంలో బయలుదేరుతారు. మొదట జనగామ జిల్లాలోని ధరావత్ తండాకు ఉదయం 10:30 గంటలకు చేరుకుంటారు. అక్కడ ఎండిపోయిన పంటపొలాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 11:30 గంటలకు సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి మండలం, అర్వపల్లి మండలం, సూర్యాపేట రూరల్ మండలాల్లో పర్యటిస్తారు. మధ్యాహ్నం 1 గంటలకు సూర్యాపేట రూరల్ మండలం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1:30 గంటలకు సూర్యాపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో లంచ్ చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు మీడియా సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3:30 గంటలకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి నల్గొండ జిల్లాకు బయలుదేరుతారు. సాయంత్రం 4:30 గంటలకు నిడమనూరు మండలానికి చేరుకుని అక్కడ ఎండిపోయిన పంటలను పరిశీలిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు నిడమనూరు నుంచి ఎర్రవెల్లికి బయలుదేరి వెళ్తారు. రోడ్డు మార్గంలోనే ప్రయాణించి రాత్రి ఏడు గంటలకు ఎర్రవెల్లి చేరుకుంటారు.

## కాంగ్రెస్‌లో చేరిన జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి



**హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో మరో సంచలనం చోటుచేసుకుంది. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్ సమక్షంలో ఆమె హస్తం గూటికి చేరుకున్నారు. కాగా, కొద్దిరోజులుగా మేయర్ విజయలక్ష్మి కాంగ్రెస్ నేతలతో టచ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నేడు ఆమె హస్తం గూటికి చేరారు. ఈరోజు ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ నివాసానికి చేరుకున్న విజయలక్ష్మి.. సీఎం, ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఇక, అంతకుముందు మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ కూడా హస్తం తీర్థం పుచ్చుకున్నారు.

## ఆ పార్టీ మోసాలు బయటకు వస్తున్నాయి

-మొదటి పేజి తరువాయి




ఏమి చేశారో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే కేవలం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. కాంగ్రెస్ అధికారం వచ్చాక కులగణన చేపట్టామని తెలిపారు. 16 కులాలకు కార్పొరేషన్లు కేటాయించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో బలహీన వర్గాలకు అన్యాయం జరిగితే అడిగే స్వేచ్ఛ తమకుందని చెప్పారు. 23 ఏళ్లలో బీఆర్ఎస్‌లో బలహీన వర్గాలకు ఏ ఒక్కరికి న్యాయం చేయలేదన్నారు. బీజేపీ బలహీన వర్గాల వ్యక్తిని అధ్యక్ష పదవి నుంచి తొలగించి కిషన్ రెడ్డికి ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ నేతలపై విమర్శలు చేసే ముందు కేటీఆర్ వొళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

## కాంగ్రెస్ జోష్

-మొదటి పేజి తరువాయి

చేరేందుకు కూడా మూహుర్తం ఖారరైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ కార్యకర్తలతో కడియం శ్రీహరి భేటీ అయ్యారు. హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో సమాలోచనలు జరుపుతున్నారు. పార్టీలోకి రావాలని కాంగ్రెస్ తనను ఆహ్వానించిందని కడియం శ్రీహరి చెప్పారు. భవిష్యత్ కార్యాచరణను కార్యకర్తలు తనకే వదిలేశారని కడియం వివరించారు. సాయంత్రం మీడియా సమావేశంలో అన్ని వివరాలు చెప్తానని కడియం శ్రీహరి తెలిపారు. మరోవైపు కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలోకి రాకను స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ సింగాపురం ఇందిర పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. 40 ఏళ్లు కాంగ్రెస్‌ను వ్యతిరేకించిన వ్యక్తిని ఎలా పార్టీలో చేర్చుకుంటారని ఆమె ప్రశ్నించారు.

# కొనసాగుతున్న నేతల ఎత్తిపోతల పథకం!

**హైదరాబాద్ :** అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన దగ్గరి నుంచి గులాబీ పార్టీ పరిస్థితి రోజు రోజుకు దిగజారుతోంది. తెలంగాణలో నీటి ఎత్తిపోతల పథకాలు ఎండిపోతున్నా.. నేతల ఎత్తిపోతల ప్రాజెక్టు మాత్రం కళకళలాడుతోంది. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. చేరడమే కాదు దానంకు సికింద్రాబాద్ ఎంపీ టికెట్ కూడా కేటాయించింది. కష్టమొచ్చినా నష్టమొచ్చినా కేసీఆర్ వెంటే నడుస్తాం.. పార్టీ మారే ప్రసక్తే లేదు.. అసలు ఆ అవసరమే లేదు.. అంటూ పార్టీ మార్పు వార్తలపై స్పందిస్తూ పెద్ద పెద్ద సవాళ్లు చేస్తున్న నేతలే.. తెల్లారితే కాంగ్రెస్ కండువానో, కాషాయ కండువానో కప్పుకుని కనిపిస్తూ.. షాక్‌లమీద షాక్‌లు ఇస్తున్నారు. పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ వెంకటేష్ నేతతో మొదలైన వలసల ప్రవాహం.. మెల్లమెల్లగా ఊపందుకుని.. ఇప్పుడు జోరుగా నడుస్తోంది. తాజాగా బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న కే.కేశవరావు కూడా బీఆర్ఎస్‌కు బైబై చెప్పారు. ఆయన కూతురు హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి కూడా హస్తం గూటికి చేరనున్నారు. అంతేనా కడియం శ్రీహరి కుటుంబం కూడా కారుదిగింది. బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ టికెట్ కడియం కూతురు కావ్యకు ఇచ్చినా ఆమె పార్టీకి రాజీనామా చేశారు. కూతురుతోపాటు తండ్రి కూడా గులాబీకి గుడ్‌బై చెప్పేశారు. ఇలా ఫ్యామిలీ ఫ్యామిలీలు ఇప్పుడు కాంగ్రెస్ జట్టులోకి చేరడంతో కాంగ్రెస్ మరింత బలంగా తయారవుతోంది. లోక్‌సభ ఎన్నికల వేళ..ఇది కచ్చితంగా బీఆర్ఎస్‌ను దెబ్బదీసే తంత్రమే. సామాజిక వర్గాల పరంగానూ చాలా వ్యూహాత్మకంగా కాంగ్రెస్ పక్కపార్టీ నేతలను తనలో కలుపుకుంటోంది. ఇప్పటికే చాలా మంది మాజీలు కూడా కాంగ్రెస్ కండువా కప్పేసుకుంటున్నారు. రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే.. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు నిజమవుతున్నట్టే కనిపిస్తున్నాయి. తాను గేట్లు తెరిస్తే.. బీఆర్ఎస్ మొత్తం ఖాళీ అవుతుందని.. కేవలం కేసీఆర్ కుటుంబ సభ్యులు ముగ్గురు నలుగురు మాత్రమే మిగులుతారని.. సంచలన స్టేట్ మెంట్ ఇచ్చారామధ్య. ఇక్కడ ఇంట్రస్టింగ్ పాయింటేంటే ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో.. బీఆర్ఎస్ నుంచి ఎవరొచ్చినా తీసుకునేది లేదని?ఆ ఇంటి మీద పిట్ట ఈ ఇంటి మీద వాలితే కాల్చేస్తా అంటూ వార్నింగ్ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఏకంగా గేట్లే ఎత్తేసేశారు. మరోవైపు సునీల్ కనుగోలు టీం కూడా రంగంలో దిగిందని.. పలువురు కీలక బీఆర్ఎస్ నేతలతో టచ్‌లోకి వెళ్తూ.. వారితో మంతనాలు జరుపుతోందని టాక్ నడుస్తోంది. కొంచెం పాజిటివ్ టాక్ ఉన్నా.. సోషల్ మీడియాలో వాళ్లే లీక్ చేసేసి.. వచ్చే వరకు ప్రచారం గట్టిగా నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక గ్రేటర్ హైదరాబాద్‌లోని మెజారిటీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తున్నారని కాంగ్రెస్ వర్గాల్లో నడుస్తున్న టాక్. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్‌రావు తదితరులు కూడా వచ్చే వారంలో గ్రాండ్ ఓల్డ్ పార్టీలోకి మారే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ఎల్‌పీని కాంగ్రెస్‌లో విలీనం చేయాలనే ప్రతిపాదనతో మరో



24 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా తమతో టచ్‌లో ఉన్నారని సీఎం సన్నిహితులు చెబుతున్నారు. అదే జరిగితే గులాబీ పార్టీ అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. 2024లో ఎలాగైనా మెజార్టీ ఎంపీ సీట్లను దక్కించుకోవాలన్న కసి మీదున్న కాంగ్రెస్, ఆపరేషన్ ఆకర్ష్‌ను చాలా వ్యూహాత్మకంగా అమలు చేస్తోంది. మెయిన్‌గా కాంగ్రెస్‌ను వదిలివెళ్లిన లీడర్స్‌ను వెనక్కి రప్పించే పనిలో పడింది. ఆపరేషన్ స్వగృహ చేపడుతూ మాజీ నేతలపై గురిపెట్టింది. అందులో భాగంగానే కేశవరావు ఇంటికి స్వయంగా సీఎం రేవంత్ వెళ్లి చర్చించారు. పార్టీలో చేరేలా చేశారు.ఇది ఆరంభం మాత్రమే ముందుముందు ఇంకా ఎక్కువ మంది జాయిన్ అవుతారంటున్నారు కాంగ్రెస్ నేతలు. తనకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతోనే తాను బీఆర్ఎస్‌కు రాజీనామా చేశానంటున్నారు కేకే. సికింద్రాబాద్, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్న రేవంత్ మరో 10 రోజుల్లోగా బీఆర్ఎస్ నుంచి మరికొంత మంది నేతలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించనున్నారు. అంతేకాదు మెదక్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలతో ఆయన చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.పార్లమెంట్ నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ చాలా సెలక్టివ్‌గా నేతలను తీసుకుంటోంది. మాదిగ వర్గానికి ఫేస్ గా వరంగల్లో ఉన్న కడియం ఫ్యామిలీని రంగంలోకి దింపబోతోంది. కడియంతో పాటు కడియం కూతురు కావ్య ఇప్పుడు అక్కడ కీలకంగా ఉన్నారు. కావ్య చేరడంతో వరంగల్ ఎంపీ అభ్యర్థి ఎవరనేది కూడా ఇంకా డిసైడ్ కాలేదు. అయితే వరంగల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ తరఫున కడియం శ్రీహరి పోటీ చేస్తారని అంతా భావించారు. అయితే ఆ సీటును కావ్యకే కాంగ్రెస్ పార్టీ కేటాయించునున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌లోచేరిన వెంటనే.. అభ్యర్థుల జాబితా ద్వారా కావ్య పేరును అధికారికంగా ప్రకటిస్తారని సమాచారం.

## సంపాదకీయం

# ఉచితాలకు హద్దు లేదా!

ఉచిత పథకాలు రాజ్యాంగబద్ధమా? అనే అంశం మరలా తెరపైకి వచ్చింది. గతంలో దీనిపై అనేక చర్చలు జరిగాయి. అత్యున్నత న్యాయస్థానం వరకూ వెళ్ళింది. ఎన్నికల సంఘం దీనిని పరిశీలన చేయాలనే సూచనలు వచ్చాయి. ప్రధాన మంత్రి మోడీ అధికారమే పరమావధిగా సంక్షేమాన్ని ఏమాత్రం పెంచని ఉచితా లు ఆర్థికాభివృద్ధికి ఆటంకం అంటూ ప్రకటన కూడా చేశారు. తాజాగా మరలా సుప్రీం కోర్టులో ఈ ఉచితాలు అనుచితం అంటూ ఓ ప్రజాప్రయోజన వాజ్యం దాఖలైంది. సుప్రీం కోర్టు కూడా ఈ పిల్ స్వీకరించి దీనిని అత్యంత ప్రాముఖ్యత గల అంశంగా ప్రకటించడం జరిగింది. దేశంలో ఆర్థిక సమతుల్యత చాలా ముఖ్యం. అందరి దగ్గరా సమానంగా డబ్బు ఉండకపోవచ్చు. కనీస అవసరాలైనా అందరికీ తీరేలా ఉండాలన్నది రాజ్యాంగ మౌలిక సూత్రం. ఈ ఉద్దేశం తోనే కొన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. అయితే కాలం గడుస్తున్న కొద్దీ సంక్షేమం అనేది శృతిమించి.. ఉచితాలు తెరపైకి వచ్చాయనే అభిప్రాయాలున్నాయి. అన్నం పెడితే ఒక పూట ఆకలి తీరుతుంది. కానీ అన్నం సంపాదించుకునే మార్గం చూపితే జీవితాంతం ఆకలి తీరుతుంది. జీవితాంతం ఆకలి తీర్చే మార్గం చూపడమే నిజమైన అభివృద్ధి. కానీ ప్రభుత్వాలు మాత్రం శాశ్వత పరిష్కారం వైపు కాకుండా తాయిలాలు పేరిట ఉపశమనాలు కల్పిస్తూ సంక్షేమం అని గొప్పగా చెప్పుకుంటున్నాయి. దేశం మొత్తం మీద అన్ని ప్రభుత్వాలు పోటాపోటీగా ఈ రకమైన ఉచిత పథకాల ప్రవాహాన్ని కొనసాగిస్తున్నాయి. అధికారాన్ని దక్కించుకోవడమే పరమావధిగా ఎన్నికల ముందు అమలు సాధ్యంకాని ఉచిత హామీలను ఇచ్చే రాజకీయ పార్టీలు పని చేస్తున్నాయి. దీనికి ఏ రాజకీయ పక్షం కూడా మినహాయింపు కాదు. ఎందుకంటే వీరు అందరూ కూడా ఒక తానులో ముక్కలే. పదవులే పరమావధిగా అధికారమే అంతిమ లక్ష్యంగా ప్రజలకు ఉచిత వరాల జల్లులు కురిపిస్తున్నారు. అంతేకాదు ఉచిత వరాల ప్రక్రియ అనేది ఒక వేలం పాటలా తయారు అయింది. ఒక రాజకీయ పక్షం ఒక ఉచితం ప్రకటిస్తే దానిని మించి మరో రాజకీయ పక్షం పోటీగా ప్రకటనలు చేస్తున్నది. శ్రేయోరాజ్య స్థాపనే లక్ష్యంగా గల ప్రభుత్వాలు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేయడంలో తప్పులేదు. అది ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత కూడా. దేశంలో దారిద్ర్యంతో ఇబ్బందిపడుతున్న, ఆకలి కోరల్లో చిక్కుకున్న ప్రజానీకాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. అయితే ఈ బాధ్యత నిర్వహించే సందర్భంలో సంక్షేమం, అభివృద్ధి ఈ రెండూ కూడా జోడెద్దుల బండిలాగ కలిసిమెలిసి ప్రయాణం చేసే రీతిలో ప్రభుత్వాలు నడుచుకోవాలి. దీనిలో ఏ ఒక్కటి విస్మరించినా ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం కావడం ఖాయం. అయినా ప్రస్తుత ప్రభుత్వాలు ఈ లక్ష్యాలను పక్కన పెట్టి అధికారమే పరమావధిగా ఓటు బ్యాంకు రాజకీయాలతో జనాకర్షక ఉచిత పథకాలను ప్రకటిస్తూ ముందుకు పోతున్నాయి.

దీని వలన ప్రభుత్వ ఆదాయంలో సగభాగం ఉచిత తాయిలాలకు మిగిలిన సగభాగం ఉద్యోగుల జీతాలకు పోతున్నది. అటువంటప్పుడు అభివృద్ధి జరిగే అవకాశం ఎక్కడ ఉంటుంది. అభివృద్ధికి సంక్షేమానికి తారతమ్యం లేకుండా పోతూ ఉంది. ప్రజలు గతంలో సమష్టి ప్రయోజనాల కోసం నాయకులను డిమాండ్ చేసే వారు. అది కాలక్రమేణా వ్యక్తిగత ప్రయోజనాల వైపు మరలిపోయింది. దీనిని గ్రహించిన నాయకులు అదే దిశగా ప్రయాణం చేసి ప్రజలను వ్యక్తిగతంగా సంతృప్తి పరచడంలో తలమునకలవుతున్నారు. అయితే ఇవన్నీ ఉపశమనాలు తప్ప శాశ్వత పరిష్కారం కాదని నాయకులకు తెలుసు. శాశ్వత పరిష్కారానికి దీర్ఘకాలిక లక్ష్యాలు ఉండాలి. అవి లేకపోతే ఎప్పటికీ పేదరికం అంతం కాదు. అయితే ఆర్థిక అసమానతలు అసాధారణంగా పెరుగుతున్న మన ఎగుడుదిగుడు సమాజంలో అట్టడుగు నుంచే బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. పైగా, మనది సంక్షేమ రాజ్యమని రాజ్యాంగంలో రాసుకున్నాం. అభివృద్ధిలో వారినీ భాగస్వాముల్ని చేసేలా సమ్మిళిత ప్రగతి అవసరం. అందుకై చేపట్టే సంక్షేమ కార్యక్రమాల పట్ల ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ, ఆ ముసుగులో యోగ్యతలు, అర్హతలతో నిమిత్తం లేకుండా అమలు చేసే పథకాలు అమలు ఎప్పటికీ సమర్థనీయం కాదు. సమష్టి ప్రయోజనాలు కోసం చేపట్టే ఉచిత పథకాలు అన్నీ ఉత్పాదకమైన విగానే భావించాలి. ఎందుకంటే ఉచిత వైద్యం, ఉచిత విద్య ఇలాంటివి ఉత్పాదకతను మెరుగు పరుస్తాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువుల అందించడం, మధ్యాహ్న భోజన పథకం, అంగన్ వాడీల ద్వారా పిల్లలకు, మహిళలకు పోషకాహారాన్ని అందించడం ఏ ఆధారం లేని వృద్ధులుకు, వితంతువులకు, వికలాంగులకు ఇచ్చే ఫించన్, రైతు బంధు, రైతు భరోసా వంటి పథకాలు వలన ఎన్నో సత్ఫలితాలు వస్తున్నాయి. ఇటువంటి వాటిని లక్ష్యం నెరవేరే వరకూ ఎప్పటికీ కొనసాగించాలి. దీనికి ఎవరూ అభ్యంతరం చెప్పరు. అదే మీరు ఒక కులానికి చెందిన వారు మీ వయసు ఇంత దాటితే నగదు బదిలీ చేస్తాం అనే పథకాలు వ్యక్తిగత ప్రయోజనాలు తప్ప సామాజిక సంక్షేమాన్ని పెంచవు. అయితే దీనికి భిన్నంగా మా ప్రభుత్వం అధికారం లోనికి వస్తే కలర్ టివి ఇస్తాం. మిక్సీ ఇస్తాం, మొబైల్ ఫోన్ ఇస్తాం, గ్రైండర్ ఇస్తాం, స్కూటీ ఇస్తాం, బంగారం ఇస్తాం అంటూ కొన్ని ప్రభుత్వాలు ప్రకటిస్తు న్నాయి. వినోదం, విలాసాలను ఉచితంగా ఇవ్వడం సంక్షేమం అవుతుందా? మతపరమైన యాత్రల కు ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం, వివాహాలకు బహుమతి అందించడం వంటి వాటిని సంక్షేమ కార్యక్రమాలు అనవచ్చా? దీనికి పోటీగా రాజకీయ పక్షాలు ఈ తరహా మరిన్ని తాయిలాలు ప్రకటించుకుంటూ పోతే నిధులు ఎక్కడ నుంచి వస్తాయి అనే ఆలోచనే ప్రభుత్వాలకు స్ఫురించడం లేదు. దీనితో పాటు ఎవరి కోసం సంక్షేమ కార్యక్రమాలు రూపకల్పన చేసి నిధులు ఖర్చు చేస్తే ఆ వర్గ ప్రయోజనాలు మెరుగవ్వాలి. అయితే సంక్షేమ ఉచితాలను పొందే వారిలో దాదాపు 30% శ్రీమంతులు ఉన్నారు. ఇది కూడా ప్రభుత్వాలకు తెలియంది కాదు. పేద ప్రజలకు చెందాల్సిన సంక్షేమ నిధులు శ్రీమంతులకు కట్టబెట్టి సమాజంలో మరింత ఆదాయ అసమానతల పెంపుకు ప్రభుత్వాలు సహకరిస్తున్నాయి. ఏది సంక్షేమ కార్యక్రమం, ఏది కాదు అనే తేడా కూడా గుర్తించలేనంత స్థితిలో నేడు ప్రభుత్వాలు నడుస్తున్నాయి. పేదలకు అందించే ఉచిత పథకాలను విమర్శించేవారు పెద్దలకు అందించే ప్రయోజనాలు గురించి మాట్లాడటం లేదు. ఒక వ్యవస్థ ద్వారా పేదలకు ఇచ్చే కొద్దిపాటి మొత్తాలను ఉచితాలు అంటున్నారు. కానీ తక్కువ పన్ను రేట్లు, మినహాయిం పుల పేరుతో నిత్యం ధనవంతులు పొందుతున్న ఉచితాలను మాత్రం ప్రోత్సాహకాలు అంటున్నారు ఇదెక్కడి న్యాయం అంటూ సామాజిక వేత్తలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంపుదల, సామాజిక అభివృద్ధి సాధన కోసం ప్రభుత్వాలు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పథకాలు ఎప్పటికీ కొనసాగించాలి. అయితే ప్రజాకర్షణ కోసం సర్కారు ఖజానాని దివాలా తీయించే ఉచిత తాయిలాల ప్రకటన ఏ మాత్రం సమర్థనీయం కాదు. అధికారమే పరమావధి ఓటు బ్యాంకు రాజకీయాలతో ఉచిత పథకాలు నగదు బదిలీ వంటివి చేస్తూ ఇది కూడా సంక్షేమమే అంటూ ఆర్థిక క్రమశిక్షణ గతి తప్పించడాన్ని ఎవరూ క్షమించకూడ దు. సంక్షేమ పథకాల ముసుగులో రాయితీలు, ఉచితాలు, ఇతర తాయిలాలతో ప్రలోభపెట్టి రాజకీయ పబ్బం గడుపుకునే రాజకీయ పక్షాలకు ఓటర్లు చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చాలా సందర్భాలలో ప్రభుత్వాలు ప్రకటించి న ఉచిత పథకాలు పొందే లబ్ధిదారు లు సైతం ముక్కున వేలేసుకుని ఆశ్చర్యపోతున్నారు. ఈ డబ్బు అంతా ఎక్కడ నుంచి తీసుకువస్తారని ప్రభుత్వాలకు ఆ మాత్రం స్పృహ లేదు. ఏదిఏమైతేనేం అధికారం కావాలి.. నిధులు కొరత అయితే కొత్త పన్నులు వేస్తారు. అదీ సాధ్యం కాకపోతే రుణాలు చేస్తారు. దురదృష్టం ఏమిటంటే నేడు దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే ఆదాయం మొత్తం జీతాలు, పెన్షన్లు, వడ్డీలు చెల్లించడానికి సరిపోవడం లేదు. కేంద్రం నుంచి ఆదాయం, కొత్త అప్పుల ద్వారా ఉచితాల సంతర్పణ చేసుకుంటూ పోతూ భావితరాల ప్రయోజనాలను తాకట్టు పెట్టే అధికారం మనకు ఎక్కడిది?

# "రెడ్ అలెర్ట్" ప్రకటించిన ఐరాస



అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు చేసిన ఏడాదిగా 2023 నిలిచిందని, 2024లో వాతావరణ మార్పులు మరింత జటిలం కానున్నాయని ఐరాస విడుదల చేసిన తాజా "గ్లోబల్ క్లైమేట్ రిపోర్ట్" స్పష్టం చేయడం ఓ ప్రమాద హెచ్చరికగా పరిగణించాలి. ఐరాసకు చెందిన 'ప్రపంచ వాతావరణశాస్త్ర సంస్థ (వరల్డ్ మెటీరాలజీ ఆర్గనైజేషన్, డబ్ల్యూఎంఓ)" విడుదల చేసిన నివేదికలో క్రమంగా హరిత గృహ వాయు వులు, సముద్ర జల ఉపరితల ఉష్ణోగ్రతలు, సముద్ర మట్టాలు, ఆర్కిటిక్/అంటార్కిటిక్ మంచు కొండలు కరగడం, కార్చిచ్చులు, తీవ్ర వరదలు, సైక్లోన్స్ లాంటివి విపరీతంగా పెరగడంతో మానవాళితో పాటు ప్రాణికోటి మనుగడ కూడా ప్రశ్నార్థకం కానుందనే నివేదిక బహిర్గత పరిచిన కఠిన వాస్తవాలు మనల్ని భయకంపితులను చేస్తున్నది. ప్రతికూల వాతావరణ మార్పుల ఫలితంగా అనేక ఇతర అవాంఛనీయ మార్పులు చోటు చేసుకున్నాయని నివేదిక స్పష్టం చేస్తున్నది. మానవ ప్రమేయ వాతావరణ ప్రతికూల మార్పులతో 2023లో ఇండియాతో పాటు ఆసియా ఖండ దేశాలు అత్యధిక ఉష్ణోగ్రతలు, వడగాలులు, కరువులు, పలు విపత్తులు నమోదు చేసుకున్నాయని డబ్ల్యూఎంఓ నివేదిక స్పష్టం చేస్తున్నది. 174 ఏండ్ల (1850 నుంచి) తర్వాత అత్యధిక వాతావరణ ఉష్ణోగ్రతలు నమోదు చేసుకున్న ఏడాదిగా 2023 నిలిచిందని పేర్కొన్నారు. పునరుత్పాదక శక్తి ఉత్పత్తులు పెరగడంతో కొంత ఊరట కలిగినా 2023 మధ్య మాసాల్లో లా నినో నుంచి ఎల్ నినో స్థితులు రావడంతో 2022 నుంచి 2023 వరకు ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరగడం రికార్డు కావడం గమనించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, రుతుపవనాలు ఆలస్యంగా రావడం గమనించారు. డెన్మార్క్‌కు చెందిన కోపన్‌హాగన్‌లో ఇటీవల జరిగిన కోప్-28 సదస్సులో కూడా 40 దేశాలకు చెందిన మినిస్టర్లు పాల్గొని తగు సూచనలు, ప్రణాళికలు ప్రకటించడం ముదావహం. నేడు నెలకొన్న ప్రతికూల వాతావరణ మార్పుల మూలంగా 2025, 2100 మధ్య 1,266 ట్రిలియన్ యూఎస్ డాలర్ల ఆర్థిక నష్టం వాటిల్లనుందనే హెచ్చరికను కూడా చేస్తున్నారు. ఏప్రిల్ 2023లో భారత్‌తో పాటు బంగ్లాదేశ్ ప్రాంతాల్లో తీవ్రమైన వడగాలులు వీచాయని, జూన్ 2023 నాటికి దక్షిణ భారత ద్వీపకల్పం గతంలో లేని విధంగా అధిక ఉష్ణోగ్రతలను నమోదు చేసుకుందని నివేదిక తెలిపింది. కొన్ని వందల ఏండ్ల అనంతరం జూలై 03, 2023 రోజున ప్రపంచంలోనే అత్యధిక ఉష్ణోగ్రత రికార్డు కావడం గమనించారు. 2023లో ప్రపంచ సగటు ఉపరితల ఉష్ణోగ్రతలు 1.45 డిగ్రీల పెరుగుదల చూపాయని, 2015 – 23 మధ్య అత్యధిక వేడిని చవిచూచాయని, సముద్ర ఉపరితలాలు అధిక వేడిని అనుభవించాయని, రికార్డు స్థాయిలో సముద్ర ఉపరితలాల పెరుగుదల జరిగిందని, పెరిగిన వేడికి దాదాపు 40 ప్రపంచవ్యాప్త మంచు కొండలు కరగడం జరిగిందనే కఠిన వాస్తవాలను నివేదిక బహిర్గతం చేసింది. 2022-23లో గ్రీన్ హౌజ్ వాయువులైన కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్‌ల గాఢతలు విపరీతంగా పెరిగి ఉష్ణోగ్రతలు పెరగడానికి ఊతం ఇచ్చాయని తెలిపారు. తీవ్రమైన వాతావరణ ప్రతికూల మార్పుల కారణంగా 2023లో 78 దేశాలకు చెందిన 333 మిలియన్ల ప్రపంచ జనాభా ఆహార అభద్రత చట్రంలో నలిగి పోయారని తెలుస్తున్నది. వాతావరణ ఉష్ణోగ్రతల పెరుగుదల 1.5 డిగ్రీలు దాటితే సముద్ర మట్టాలు పెరగడం, శాశ్వత మంచు కొండలు కరగడం, జీవ వైవిధ్యానికి తూట్లు పడడం, నీటి కొరి ఏర్పడడం, విపరీత వాతావరణ మార్పులు చోటు చేసుకోవడం, ఆహార కొరత ఏర్పడడం జరుగుతుందని గమనించాలి. ఇలాంటి వాతావరణ ప్రతికూలతలకు విరుగుడుగా హరిత గృహ వాయువుల విడుదలను కట్టడి చేయడానికి శిలాజ ఇంధనాల వినియోగాన్ని క్రమంగా తగ్గించడంతో పాటు హరిత క్షేత్రాలను పెంచడం, పునరుత్పాదక తరగని ఇంధనాల వినియోగాన్ని పెంచడం, జీవ వైవిధ్యతను కాపాడడం, కార్బన్ ఉద్గారాలను జీరో స్థాయికి తగ్గించడం అత్యవసరమని గమనించి ప్రపంచ దేశాలు, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలు ప్రతిన బూనడం జరగాలి. 2023లో పునరుత్పాదక శక్తి ఉత్పత్తి 50 శాతం పెరిగిందని, కోప్-28 సదస్సు సిఫార్సు మేరకు 2030 నాటికి తరగని పునరుత్పాదక శక్తి ఉత్పత్తిని మూడు రెట్ల పెంచుతూ 11,000 గిగావాట్స్ వరకు చేర్చాలని నివేదిక అనివార్య సూచిస్తున్నది. గత ఐదు దశాబ్దాలు జరుగుతున్న పర్యావరణ విధ్వంసాలను గమనిస్తున్న ప్రపంచ దేశాలు తమ తాత్కాలిక లాభాల వేటలో కళ్లు మూసుకొని తమకు పట్టనట్లు వ్యవహరించడంతో రాబోయే తరాల ఉనికి పెనం లాంటి పొయ్యిలో పడినట్లు అవనున్నదని ఐరాస "వాతావరణ రెడ్ అలెర్ట్" జారీ చేయడం మనందరి భయానికి కారణం అవుతున్నది. 2023 నమోదు చేసుకున్న తీవ్రమైన వడగాలులు 2024లో మరింత పెరగవచ్చని కూడా నిపుణులు పేర్కొనడం సామాన్యులను కలవర పెడుతున్నది. ఇప్పటికైనా పరిస్థితులను ఆకళింపు చేసుకొని "మనం కూర్చున్నా కొమ్మను మనమే నరుక్కోకుండా", భవిష్యత్తు తరాలకు ఆస్తి కన్న మిన్న అయిన ఆరోగ్యకర వాతావరణాన్ని అందించే పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో మనమందరం సమిధలుగా మారి, రేపటి తరానికి అమూల్యమైన జీవించే చల్లని వాతావరణాన్ని బహుకరిద్దాం.

# అసమాన సేవా తత్పరుడు



జనరల్ కోదండర సుబ్బయ్య తిమ్మయ్య భారత సైన్యంలో ఒక విశిష్ట సైనికుడు. అయన 1957 నుండి 1961 వరకు భారత చైనా దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న సమయంలో భారత సైన్యంలో ఛీఫ్ ఇన్ ఆర్మీ స్టాఫ్‌గా కీలకమైన సేవలను అందించారు. రెండవ ప్రపంచ యుద్ధం పదాతి దళానికి నాయకత్వం వహించిన ఏకైక భారతీయుడు. ఆయన భారత సైన్యం అందించిన విశిష్ట అధికారిగా గుర్తింపు పొందారు. కొరియా యుద్ధం తరువాత, యుద్ధ ఖైదీలను వారి వారి దేశాలకు తిరిగి పంపే పనిలో ఐక్యరాజ్య సమితి విభాగానికి నాయకత్వం వహిం చారు. ఆర్మీ నుండి పదవీ విరమణ చేసిన తరువాత 1964 జూలై నుండి డిసెంబరు 1965 వరకు సైప్రస్ దేశంలో ఐక్యరాజ్య సమితి శాంతి సంరక్షక దళానికి కమాండ ర్‌గా నియమించ బడ్డారు. సైప్రస్ లో 18 డిసెంబరు 1965లో మరణించారు. ఆయన కర్ణాటక రాష్ట్రం కొడగు జిల్లా (పూర్వపు పేరు కూర్గ్) మద్దికెరి గ్రామంలో 1906, మార్చి 30వ తేదీన తిమ్మయ్య సీతమ్మ దంపతులకు జన్మించారు. తల్లి సీతమ్మ విద్యావంతురాలు, సంఘ సేవకురాలు. ఆమెకు బ్రిటిష్ ప్రభు త్వం కైసర్ - ఎ- హింద్ బిరుదును ప్రదానం చేసింది. ఆయ న అన్న పొన్నప్ప, తాను, తమ తమ్ముడు సోమయ్య ముగ్గురూ భారత సైన్యం లో అధికారులుగా పనిచేశారు. మెరుగైన విద్య అభ్యసించాలనే ఉద్దేశంతో తన 8వ యేటనే తమిళ నాడు రాష్ట్రం కూనూరులోని సెయింట్ జోసెఫ్ కాలేజీలో చేరారు. ఆ తర్వాత బెంగళూరు లోని బిషప్ కాటన్ బాయ్స్ స్కూలులో చదివారు.

ప్రాథమిక విద్య ముగిసి న తరువాత డెహ్రాడూన్ లోని ప్రిన్స్ ఆఫ్ వేల్స్ రాయల్ ఇండియన్ మిలటరీ కాలేజీలో చేరారు. అక్కడి నుండి పట్టా పొందిన తరువాత ఆయన ఇంగ్లాండు లోని రాయల్ మిలటరీ కాలేజీకి తర్వాత శిక్షణ కోసం ఎంపిక చేయ బడ్డారు. మిలటరీ శిక్షణ తరువాత 1926 ఫిబ్రవరి 4న అయనను బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సెకండ్ లెఫ్టినెంట్‌గా నియమించారు. ఆ బ్యాచ్‌లో నియమింప బడిన వారిలో ఆయన తరువాత ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా పనిచేసిన ప్రాణ్ నాథ్ థాపర్ ఉన్నారు. తిమ్మయ్య 19వ హైదరాబాద్ రెజిమెంట్‌కు చెందిన 4వ బెటాలియన్‌లో 1927 మే 28 న నియమించ బడ్డారు. 1928 మే 4 న ఇతడు లెఫ్టినెంట్‌గా పదోన్నతి పొందారు. 1930లో రెజిమెంటల్ సహాయాధికారిగా నియమించిన తరువాత తన నైపుణ్యంతో నార్త్ వెస్ట్ ఫ్రంటియర్ (నేటి పాకిస్తాన్) లోని పఠాన్ ఆదివాసీ తిరుగుబాటు దారులను అణచ గలిగారు. 1935 ఫిబ్రవరి 4న ఇతడు కెప్టెన్‌గా పదోన్నతి పొందారు. 1936 ఏప్రిల్‌లో ఇతడు మద్రాసులోని యూనివర్సిటీ ట్రైనింగ్ కార్ప్స్‌కు సహాయాధికారిగా బదిలీ కాబడ్డారు. తరువాత ఆయనను సింగపూర్ బెటాలియన్‌కు బదిలీ చేశారు. 1941లో ఆయనను ఆగ్రాలోని హైదరాబాద్ రెజిమెంటల్ సెంటర్‌లో సెకండ్ - ఇన్ - కామాం డ్‌గా నియమించారు. తరువాత ఇతనిని క్వెట్టాలోని స్టాఫ్ కాలేజీలో శిక్షణ కోసం పంపారు. అక్కడ అయన, అయన భార్య 1935 క్వెట్టా భూకంప బాధితులకు ఎనలేని సేవలను అందించారు. 1943లో ఆయనను మేజర్ పదవి లభించింది.

ఇతడు 25వ పదాతి దళానికి గ్రేడ్2 స్టాఫ్ ఆఫీసర్‌గా నియమితుడైనారు. సైన్యంలో ఆ పదవిని వరించిన తొలి భారతీ యుడు తిమ్మయ్య. పదాతి దళం అడవులలో యుద్ధ శిక్షణను పొంది రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ సేనలను బర్మాలో ఎదుర్కొంది. 1944లో అయన లెఫ్టినెంట్ కల్నల్‌గా పదోన్నతి పొంది బర్మాలో 8వ, 19వ హైదరాబాద్ రెజిమెంట్‌లకు కమాండింగ్ ఆఫీసర్‌గా పనిచేశారు. 1945లో ఇతడు బ్రిగేడియర్ ర్యాంకుకు ఎదిగారు. యుద్ధంలో అయన సేవలకు గుర్తింపుగా డిస్టింగ్విష్డ్ సర్వీస్ ఆర్డర్(%ఐ.వా.వా%)ను ప్రకటించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆయనను స్వదేశానికి వెనుకకు రప్పించారు. 1947లో భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత పాకిస్తాన్ విభజన సందర్భంగా భారత్ పాకిస్తాన్‌ల మధ్య ఆయుధాలు, పనిముట్లు, సైన్యం పంపకాల కమిటీలో ఆయనను సభ్యుడిగా నియమించారు. దాని తరువాత సెప్టెంబర్ 1947లో మేజర్ జనరల్‌గా పదోన్నతి కల్పించి 4వ పదాతి దళానికి కమాండ్‌గా నియమించారు. 1948లో కాశ్మీర్‌లో జరిగిన భారత్-పాక్ యుద్ధంలో ఇతడు క్రియాశీలక పాత్రను నిర్వహించారు. 19వ పదాతి దళానికి కమాండర్‌గా వ్యవహరిస్తూ కాశ్మీర్ లోయ నుండి పాకిస్తాన్ సేనను తరిమికొట్టారు. షేక్ అబ్దుల్లా, బక్షి గులాం మొహ మ్మద్, జవహర్‌లాల్ నెహ్రూలతో సత్సంబంధాలను ఏర్పరచు కున్నారు. డెహ్రాడూన్ లోని ప్రతిష్టాత్మక ఇండియన్ మిలటరీ అకాడమీకి కమాండెంట్‌గా వ్యవహరించారు.

ఆయనకు గల అపార అనుభ వాన్ని పరిగణనలో తీసుకుని ఐకరాజ్య సమితి... తటస్థ దేశాల రిపాట్రియేషన్ కమీషన్‌కు ముఖ్యునిగా నియమించి కొరియాకు పంపింది. ఇది చాలా సున్నితమైన, అసాధారణమైన పని కావడంతో చాకచక్యంతో నెరవేర్చ గలిగారు. ఆయన స్వదేశానికి తిరిగి వచ్చి లెఫ్టినెంట్ జనరల్ హోదాలో జనరల్ ఆఫీసర్ కమాండింగ్, సదరన్ కమాండ్‌గా 1953లో నియమితుడైనారు. 1954లో ఇతనికి భారత ప్రభుత్వం పద్మ భూషణ్ అవార్డును ఇచ్చి సత్కరించింది. ఆయన 1957, మే 7న 6వ ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలను చేపట్టారు. 1959లో అప్పటి కేంద్ర రక్షణ మంత్రి వి. కె. కృష్ణ మేనన్ తో ఏర్పడిన విభేదాల కారణంగా పదవికి రాజీనామా చేశారు. కానీ ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ అయన రాజీనామాను తిరస్కరించడంతో పదవిలో కొనసాగారు. 35 ఏళ్ల మిలటరీ సర్వీసు పూర్తి చేసుకుని 1961 మే 7న పదవీ విరమణ చేశారు. భారత సైన్యం నుండి పదవీ విరమణ తరువాత ఐక్యరాజ్య సమితి ఆయన సేవలను మరోసారి ఉపయోగించ తలపెట్టి, సైప్రస్‌లో ఐక్యరాజ్య సమితి సేన (%ఖచీఫీ×జ్ఞా%) లకు కమాండర్‌గా జూలై 1964లో నియమించింది. ఆ పదవిలో ఉన్న సమయం లోనే 1965, డిసెంబరు 17న మరణించారు. ఆయన పార్థివ దేహాన్ని అంత్యక్రియల కోసం బెంగళూరుకు తరలించారు. అయన స్మృత్యర్థం బెంగళూరు, పూనే, సైప్రస్‌లోని లార్నకా నగరాలలో కొన్ని వీధులకు జనరల్ తిమ్మయ్య రోడ్ అని నామకరణం చేశారు. 1966లో రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ ఇతని స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసి గౌరవించింది.

## కార్పొరేట్ కళాశాలల ఇష్టారాజ్యం

ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియకముందే వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభించేశారు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల వారు. విద్యను వ్యాపారంగా చేసి ఆఫర్ల పేరుతో ఇప్పుడే అడ్మిషన్ తీసుకుంటే 30 నుండి 50% రాయితీ ఉంటది, భవిష్యత్‌లో ఎలాంటి అదనపు ఫీజు ఛార్జీలు ఉండవంటూ విద్యార్థినీ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి మూడు నెలల ముందే కార్పొరేట్ పాఠశాలలు, ఇంటర్ కళాశాలల వారు ముందస్తు ప్రవేశాలకు తెరలేపాయి. ప్రస్తుతం పదో తరగతి వార్షిక పరీక్ష రాస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెబుతూ విద్యార్థులకు సీటు రిజర్వు చేస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు తీసుకుంటున్నా,అడ్మిషన్లు ప్రారంభం అని ప్రచారాలు చేస్తున్న అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. కార్పొరేట్ కళాశాలలు,పాఠశాలలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, ప్రధాన పట్టణాలతో పాటు పలు ప్రాంతాల్లో పీఆర్‌ఓలను నియమించుకున్నాయి. వీరు పదో తరగతి విద్యార్థులు తల్లిదండ్రులను మచ్చిక చేసుకొని ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ముందస్తు ప్రవేశాలకు మాత్రమే ఫీజులో రాయితీ ఉంటుందని నమ్మబలుకుతూ కనీసం 60 శాతం ఫీజును ముందే తీసేసుకుంటున్నారు. ఆ మాత్రమైనా చెల్లించకపోతే ఐడీ నెంబర్ రాదని భయపెడుతున్నారు.ఇప్పటికే కొన్ని విద్యాసంస్థలు అడ్మిషన్లు అయిపోయాయి అని బోర్డులు కూడా పెట్టాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు అక్షరాలతో లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నాయి.

http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



# స్థానిక వార్తలు

## కోటగిరి లో చలివేంద్రం ప్రారంభం




**వాస్తవ నేస్తం,కోటగిరి:** మండల కేంద్రంలో శనివారం చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ పెద్దలు ఉమాకాంత్ దేశముఖ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. యువకులు చలివేంద్రం ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. వేసవికాలంలో ప్రయాణికుల కోసం దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవా కార్యక్రమంలో యువకులు పాల్గొనడం హర్షనీయమన్నారు. చత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకొని యువకులు సేవా కార్యక్రమాలలో ముందుకు సాగాలని కొనియాడారు. పార్టీలకు అతీతంగా యువకులు ఇలాంటి కార్యక్రమాలకు ముందుకు రావడం హర్షనియమని రాబోయే రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలకు చేయూతనందిస్తామని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. వేసవికాలంతోపాటు ధాన్యం ఆరబోసే రోజులు కావడంతో రైతులు ప్రయాణికులు బాటసారులు అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అని కొనియాడారు తొలి రోజు చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బిమసాయిరెడ్డి తెల్ల రవికుమార్ బీజేపీ మండల అధ్యక్షులు యముల నవీన్, బర్ల మధు, కప్ప సంతోష్, అనిల్, దౌలయ్య, చత్రపతి శివాజీ యూత్ నిర్వాహకులు, బాన్సువాడ హనుమాన్లు, గాండ్ల గోపి, ఎక్కర్ల వీరేశం, యోగేశ్వర్, అరుణ్ గౌడ్, పెద్ద కాపు శ్రీకాంత్, శ్యామల కులకర్ణి గాండ్ల మధు, వినోద్ పటేల్, నీలి శివ, యువకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన ఎంపీ అభ్యర్థి సురేష్ షేట్కార్



**వాస్తవ నేస్తం,కోటగిరి:** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ గంగాధర్ దేశాయి అనారోగ్యానికి గురి కావడంతో ఆయనను కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఎంపి అభ్యర్థి సురేష్ షేట్కార్ శనివారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉమ్మడి మండల కాంగ్రెస్ నాయకులు ఆయనను సన్మానించారు. ఆయన వెంట రాకేష్ షేట్కార్, శివరాజ్ దేశాయ్, ఇందూర్ శేఖర్, కూనిపూర్ రాజిరెడ్డి, రాంపూర్ శ్రీనివాస్,కొల్లూర్ కిషోర్, అనంత విఠల్,సలీం, సాయిరెడ్డి హన్మంత్,ఆనంద్ తదితరులు ఉన్నారు.

## ప్రజల్లో ధైర్యం నింపేందుకు పోలీసుల ఫ్లాగ్ మార్చ్



**వాస్తవ నేస్తం,బోనకల్:** శాంతి భద్రతలకు విగాథం కలగకుండా, ప్రశాంత వాతావరణం లో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి బోనకల్ పోలీసులు కవాతు నిర్వహించారు. వైరా ఏసీపీ రెహమాన్, మధిర సీఐ మధు, ఎస్సై మధుబాబు ల ఆధ్వర్యంలో బోనకల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోనకల్, గోవిందా పురం (ఎల్) గ్రామాలలో సాయుధ బలగాలతో కలిసి పోలీస్ అధికారులు గ్రామంలో తిరుగుతూ ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, వారిలో ధైర్యాన్ని నింపే విధంగా ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా ఏసీపీ రెహమాన్ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, దానికి పోలీసుల సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసా కల్పిస్తున్నామన్నారు.


## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వాస్తవ నేస్తం,కోదాడ:** పట్టణంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది అని ఏఈ శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో అవుట్డోర్ సబ్స్టేషన్ పరిధిలోని నయానగర్, భవాని నగర్ లో ట్రీ కటింగ్ మరియు 11కె.వి లైన్ లలో మరమత్తుల కొరకు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతున్నది. కావున వినియోగదారులందరూ సహకరించాలన్నారు.

## ఆపదలో అపర్ణాస్తం రాందేవ్ రావు హాస్పటల్

**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** కూకట్పల్లి రాందేవ్ రావు హాస్పటల్లో అత్యవసర పరిస్థితుల్లో జర్నలిస్ట్ చంద్రశేఖర్ కూతురు మానస రెండు రోజుల క్రితం ఇంట్లో కింద పడడం వల్ల నేడు ఎమర్జెన్సీగా మారింది. వెంటనే రాందేవ్ రావు హాస్పటల్లో చికిత్స నిమిత్తం తీసుకురాగా రాందేవ్ రావు హాస్పిటల్ సీఈవో యోబు నట్ట విషయం తెలియజేయగా ఫోన్ లో విలేకరులకు హాస్పటల్ యాజమాన్యం ఇచ్చిన సదుపాయాన్ని డబ్బులు అనే విషయం ఫస్ట్ ఏది మాట్లాడకుండా ముందుగా ట్రీట్మెంట్ అందించారు. జర్నలిస్ట్ ఇలా ఆదుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు రుణపడి ఉంటాము ప్రజా సేవకై నా జర్నలిజన్ని మరింత మందికి చేరువ చేసేలా ముందుకు వెళ్దాం.

## దీపా దాస్ మున్షీ తో నీలం మధు భేటీ



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపా దాస్ మున్షితో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా వారి నివాసంలో కలిశారు. ఇందిరాగాంధీ లాంటి మహోన్నత నేత ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంట్ స్థానాన్ని తనకు కేటాయించడం పట్ల కాంగ్రెస్ అధిష్టానానికి రుణపడి ఉంటానని తెలిపారు. తనకు టికెట్ రావడంలో సహకరించిన దీపా దాస్ మున్షి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో మెదక్ పార్లమెంట్ టికెట్ను కేటాయించిన కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ రాహుల్ గాంధీకి మెదక్ సీటును గెలిచి కానుకగా అందిస్తాం అని స్పష్టం చేశారు. అందరి సహకారంతో మెదక్ పార్లమెంట్ పరిధిలోని అన్ని వర్గాల నేతలను కలుపుకొని ఎన్నికల్లో ముందుకు పోయి మెదక్ సీటును గెలుస్తాం అని ధీమా వ్యక్తం చేశారు.

## నీలం మధు కు పెరిగిన మద్దతుల వెల్లువ

### - మెదక్ పార్లమెంట్ పరిధి నుంచి భారీగా తరలివస్తున్న పార్టీ శ్రేణులు



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ కి మద్ధతుల వెల్లువ కొనసాగుతుంది. మెదక్ పార్లమెంట్ నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్న వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సబ్బండ కుల సంఘాలు, మహిళలు పెద్ద ఎత్తున నీలంకు మద్దతు తెలుపుతున్నారు. చిట్కుల్లోని ఎన్ఎం అర్ క్యాంప్ కార్యాలయానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వస్తున్నారు. సబ్బండ వర్గాల మద్దతుతో బీసీ బిడ్డకు పార్లమెంట్ టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలందరూ ఓటు వేసి గెలిపిస్తారన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నీలం మధు లాంటి వ్యక్తి పార్లమెంటుకు వెళ్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తామంతా స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం చేసి నీలం మధు ముదిరాజ్ ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని భరోసా ఇచ్చారు.

## శ్రీ సాయి హాస్పిటల్ యజమాన్యం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు




**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** జిల్లా కేంద్రంలోని రహమత్ నగర్ లోని శ్రీ సాయి హాస్పిటల్ యాజమాన్యం నాగశ్రీ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీ సాయి హాస్పిటల్ యాజమాన్య దంపతులు నాగశ్రీ ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ ముస్లిం సోదరులు కులమతాల కు అతీతంగా కలిసిమెలిసి ఉండటం చాలా సంతోషకర మన్నారు. ముస్లిం పండుగలను హిందూ సోదరులతో కలిసి చేసుకోవడం హిందూ పండుగలను కూడా ముస్లిం సోదరులు వాతావరణంలో కలిసిమెలిసి చేసుకోవడం నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ టిఆర్ఎస్ నాయకులు శమీ, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని పంచాయతీ కార్మికులకు ఈఎస్ఐ పిఎఫ్ యూనిఫామ్ బ్లౌజులు శానిటైజర్ సబ్బులు ఇతరత నిరంతర వస్తువులు కార్మికులకు ఇవ్వాలి జూనియర్ అసిస్టెంట్ చంద్రప్రకాష్'కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కే రాజయ్య మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాలలో గత మూడు నాలుగు ఐదు ఆరు నెల నుండి వేతనాలు కార్మికులకు ఇవ్వడం లేదు నిరంతరం గ్రామపంచాయతీలో పనిచేస్తున్నటువంటి సిబ్బందికి ప్రతి నెల జీతాలు ఇవ్వకపోవడం వల్ల కుటుంబ సమస్యలు చాలా ఇబ్బంది గురవుతున్నాయి అన్నారు. ఉదయం వెళ్లేచి గ్రామంలో ఉన్నటువంటి పరిశుభ్ర కార్యక్రమంలో చేస్తున్న సందర్భంగా ప్రమాదవశాత్తు సంభవించినచో ఈఎస్ఐ పిఎఫ్ యూనిఫామ్ సబ్బులు సరుకులు ఇవ్వాలని చెప్పేసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ డివిజన్ నాయకులు వెంకయ్య, మండల అధ్యక్ష కార్యదర్శులు సంజీవులు, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఇచ్చోడ విట్టల్ రుక్మిణి దేవాలయంలో సత్సంగ కార్యక్రమం



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** మండల కేంద్రంలోని విట్టల్ రుక్మిణి దేవాలయంలో ఆదివారం ఉదయం వైష్ణవ సదన్ నారాయణ మహారాజ్ వారి ఆధ్యాత్మిక చింతనతో 977 సత్యంగ కార్యక్రమం ఉంటుందని విట్టల్ రుక్మిణి హరి భక్త పారాయణ వైష్ణవ సదన్ నారాయణ మహారాజ్ భక్తులు తెలిపారు. సత్సంగ కార్యక్రమానికి వచ్చే భక్తులకు అన్న వితరణ ప్రసాద కార్యక్రమము ఉంటుందని తెలిపారు.

## లోకసభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలి

**జిల్లా ఎన్నికల అధికారి క్రాంతి వల్లూరి**



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** లోక్ సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని పార్టీల రాజకీయ నాయకులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు క్రాంతి వల్లూరు అన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్ లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 16న ఎన్నికల కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిందని ఏప్రిల్ 18 న నోటిఫికేషన్, 25న నామినేషన్స్ స్వీకరణకు చివరి తేదని,26న నామినేషన్ల స్క్రూటీని,29 న నామినేషన్ల ఉపసంహరణ, మే 13 న పోలింగ్, జూన్ 4 న కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినందున మతం, కులం, ప్రాంతం పై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం తప్పుడు ప్రచారం చేయడం పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అడ్వర్టైజ్మెంట్ లు ప్రకటనల కోసం 48 గంటల ముందు ఎం సి ఎం సి దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలలో అక్రమాలు జరిగితే 1950 నెంబర్ ద్వారా, సివిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఎన్నికల ప్రవర్తనానియామావళిని ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని అన్నారు. ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. జిల్లాలో స్వీప్ కార్యాచరణ పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఓటు హక్కు పై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం,ఓటు ప్రాముఖ్యత తెలిసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టి చైతన్యం తెచ్చేలా కార్యక్రమాలు రూపొందించామని అన్నారు. ఓటర్లు డబ్బు, మద్యం, బహుమతుల ఎన్నికల వేళ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిష్పక్షపాతంగా అభ్యర్థులను ఎన్నుకున్నట్లైతే తిరిగి వారి నుండి మనం మంచిని ఆశించవచ్చన్న విషయాన్ని యువ ఓటర్లకు తెలియజేయడం కనీస భాధ్యత అని అన్నారు. సివిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయడం ద్వారా వంద నిమిషాలలో ఫిర్యాదులను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా కూడా ఓటు హక్కు పై అవగాహన కల్పించే విధంగా ప్రసారాలు చేయవచ్చన్నారు. ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఆంటోనీ, వివిధ పార్టీ నాయకులు బాషా, కృష్ణ, సాజిద్ ఇర్ఫాన్ వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెదాలు నల్లగా మారుతున్నాయా..

చాలామంది యువత ఆరోగ్యం పై, అందంపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తుంటారు. అందులో భాగంగానే తమజుట్టుకు, ముఖం అందంగా కనిపించేందుకు ఆముదం రాసుకుంటుంటారు. అంతే కాదు కొంత మంది ఆ నూనెను ఆహారంలో కూడా చేర్చుకుంటారు. ఈ ఆముదంలో అనేక ఔషధ గుణాలు, పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఒమేగా 6, 9 వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఇందులో ఉంటాయి. విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అంతే కాకుండా యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కూడా ఆముదంలో ఉన్నాయి. ఈ నూనెను ఆహారంలో చేర్చుకోవడం వల్ల రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. అలాగే జీర్ణక్రియను కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ నూనెను రోజూ ముఖానికి రాసుకోవడం వల్ల అలర్జీలు, మొటిమలు, మచ్చలు, మొదలైన సమస్యలు దూరమవుతాయి. మీరు ప్రతిరోజూ మీ పెదవుల పై ఆముదం నూనెను రాసుకుంటే, అది మీ పెదాలను మృదువుగా, గులాబీ రంగులో మార్చడంలో సహాయపడుతుంది. అంతే కాదు ఇంకా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఆముదం రాసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు.. పెదవుల పిగ్మెంటేషన్ పోతుంది.



చనిపోయిన చర్మం క్లియర్ అవుతుంది. పెదవుల పొడిబారితనం పోతుంది. పెదవులు సహజంగా తేమగా, హైడ్రేటెడ్ గా ఉంటాయి. పగిలిన పెదాలను వదిలించుకోవాలి. పెదాల నల్లని సమస్య దూరమవు తుంది. క్రమంగా పెదవులు సహజంగా గులాబీ రంగులోకి మారతాయి. పెదవుల పై ఆముదం ఎలా రాయాలి.. పెదాలను సహజంగా గులాబీ రంగులోకి మార్చడానికి మీరు నేరుగా ఆముదం నూనెను అప్లై చేయవచ్చు. దీని కోసం ఒకటి లేదా రెండు చుక్కల ఆముదం తీసుకుని, దానితో మీ పెదాలను మసాజ్ చేయండి. మీరు దీన్ని ప్రతిరోజూ ఉదయం ఇంటి నుండి బయలుదేరే ముందు, రాత్రి పడుకునే ముందు మీ పెదవుల పై రాయాలి. మీకు కావాలంటే మీరు సహజ పదార్థాల సహాయంతో ఇంట్లోనే కాస్టర్ ఆయిల్ లిప్ బామ్‌ను తయారు చేసుకోవచ్చు. దీని కోసం, ముందుగా పాన్‌లో షియా బటర్‌ను కరిగించాలి. ఆపై గ్యాస్‌ను ఆపివేయాలి. అది కరిగిన తర్వాత ఒక చెంచా ఆముదం, తేనె, మీకు నచ్చిన ఏదైనా నూనెను జోడించండి. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఈ లిప్ బామ్‌ను తప్పనిసరిగా అప్లై చేయాలి. ఇలా చేయడం ద్వారా పెదవులు అందంగా కనిపిస్తాయని చెబుతారు.

# తమలపాకు తులసి గింజలను కలిపి తింటే





మామూలుగా చాలామంది ఈ తమలపాకు తినే అలవాటు ఉంటుంది. ఈ తమలపాకుని పాన్ బీడా, పాన్, ఇంకా కొన్ని కొన్ని పదార్థాల ద్వారా తమలపాకులు తీసుకుంటూ ఉంటారు. తమలపాకును తినడానికి ఇష్టపడేవారు తమలపాకు, జర్దా, సున్నం కలిపి తింటే ఆరోగ్యానికి చాలా హానికరం. అయితే ప్రతి నాణేనికి రెండు వైపులా ఉన్నట్టుగానే తమలపాకు తినడం వల్ల కూడా చాలా ప్రయోజనాలు ఉన్నాయి. తమలపాకు లోని ఆస్ట్రింజెంట్ ఎన్నో అనారోగ్య సమస్యలను తగ్గిస్తుంది. తమలపాకులు, తులసి గింజలను కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయి. తమలపాకులు, తులసి గింజలను కలిపి తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది అనేక విధాలుగా ఇన్ఫెక్షన్లతో పోరాడడంలో సహాయపడుతుంది. తమలపాకులు, తులసి గింజలను కలిపి తీసుకోవడం వల్ల శరీరంలోని అనేక రకాల బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్లతో పోరాడుతుంది. వాతావరణంలో మార్పు కారణంగా శరీరంలో అనేక రకాల సమస్యలు మొదలవుతాయి. ఈ సమస్యలలో జలుబు, దగ్గు కూడా ఒకటి. జలుబు అనేది ఒక సాధారణ అనారోగ్య సమస్య. కానీ కరోనా వైరస్ తర్వాత ఈ వ్యాధి సాధారణమైనది కాదు. అటువంటి పరిస్థితిలో తమలపాకులు, తులసి గింజలతో కలిపి తింటే చక్కటి ఫలితం ఉంటుంది. ఇది జలుబు, దగ్గు సమస్యను దూరం చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల గొంతు నొప్పి, దృఢత్వం నుండి ఉపశమనం లభిస్తుంది. ఈ తమలపాకుపాటు తులసి గింజలను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ కూడా బలంగా ఉంటుంది. దీంతో పొట్ట సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. తులసి గింజలను తమలపాకులతో కలిపి తీసుకుంటే మలబద్ధకం, గ్యాస్ సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. తమలపాకులు, తులసి గింజలు కలిపి తీసుకోవటం వల్ల చిగుళ్ల వాపు, దంతాల పసుపు నుండి కూడా ఉపశమనాన్ని అందిస్తాయి. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు చిగుళ్లలో వాపు, గడ్డలు, రక్తస్రావం నుండి ఉపశమనం కలిగిస్తాయి. చాలా సార్లు నోటి నుండి దుర్వాసన సమస్య ఉంటుంది. ఈ దుర్వాసన చాలాసార్లు బ్రష్ చేసినా, కడిగినా పోదు. అయితే తమలపాకులో తులసి గింజలు వేసి క్రమం తప్పకుండా తీసుకుంటే నోటి దుర్వాసన సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.

# బీరకాయను అవాయిడ్ చేస్తున్నారా..?

మన వంటింట్లో దొరికే కూరగాయలలో బీరకాయ కూడా ఒకటి. ఈ బీరకాయను ఉపయోగించి ఎన్నో రకాల రెసిపీలు తయారు చేస్తూ ఉంటారు.. అయితే కొందరు బీరకాయను లొట్టలు వేసుకొని తింటే, మరికొందరు అసలు బీరకాయ తినడానికి ఇష్టపడరు. ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది.. కాబట్టి అత్యధిక నీటిశాతం కలిగిన బీరకాయను ఎండాకాలంలో తింటే చాలా మంచిది. మరి కేవలం ఇవి మాత్రమే కాకుండా ఎండాకాలంలో బీరకాయలు తినడం వల్ల ఇంకా ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. బీరకాయ అనేది పోషకాలతో నిండిన కూరగాయ. ఇందులో విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ కె, ఫోలేట్, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలు దాగున్నాయి. ఇవి మన శారీరక, మానసిక ఆరోగ్యానికి చాలా అవసరం. బీరకాయ ముఖ్యంగా తక్కువ కేలరీలు కలిగి ఉండటంతో పాటు శక్తి వనరు. ఇది అధిక మొత్తంలో నీరు, ఫైబర్ కలిగి ఉంటుంది. ఇది ఆహారాన్ని నిల్వ చేయడంలో సహాయపడుతుంది. ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. అందువల్ల, బీరకాయ కూరగాయ బరువు నియంత్రణకు గొప్ప ఎంపికగా పరిగణిస్తారు. బీరకాయలో మంచి మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇది తిన్న తర్వాత, సాధారణంగా గ్యాస్ లేదా అజీర్ణం గురించి ఆందోళన ఉండదు. బీరకాయలో పెద్ద మొత్తంలో పొటాషియం ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి ప్రయోజనకరంగా పరిగణిస్తారు. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. ఇంకా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అలాగే బీరకాయ పేగులను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. బీరకాయ పేగులను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడే అనేక లక్షణాలు ఉన్నాయి. ఇందులో విటమిన్ ఎ, ఫైబర్ ఉన్నాయి. ఇది పొట్టను శుభ్రపరచడంలో సహాయపడుతుంది.



మరి ఇన్ని ప్రయోజనాలు ఉన్న బీరకాయను అవాయిడ్ చేస్తుంటే వెంటనే తినడం మొదలు పెట్టండి.

# తులసి మొక్కలో ఎన్నో ఔషధ గుణాలు



హిందూ సాంప్రదాయంలో తులసి మొక్కకు ప్రత్యేక స్థానం ఉంది. తులసి మొక్కలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. తులసి మొక్క మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. తులసిలో కాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్, మెగ్నీషియం, సోడియం, ఆస్కార్బిక్ ఆమ్లం, కార్బోహైడ్రేట్స్ ఉన్నాయి. వీటి వల్ల రక్త వృద్ధి, గుండెకు బలం, ఎముకలు గట్టితనం, గుండెపోటు రాకుండా గాయాలు మానేందుకు చర్మ సౌందర్యానికి అవయవాల పెరుగుదలకి ,గోర్లు ఆరోగ్యంగా ఉండేందుకు ఈ తులసి ఆకులు ఉపయోగపడతాయి. అందుకే వైద్యులు తరచుగా తులసి కషాయం తులసి ఆకులను తీసుకోవాలని చెబుతూ ఉంటారు. అయితే మరి పరగడుపున ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి ఆకులను తింటే ఏం జరుగుతుందో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. ఉదయాన్నే తులసి ఆకులను నమలడం వల్ల అధిక కొలెస్ట్రాల్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎందుకంటే ఈ రోజుల్లో కొలెస్ట్రాల్‌తో బాధపడేవారు చాలా మంది ఉన్నారు. శరీరంలో కొలెస్ట్రాల్ పెరిగిపోతే ప్రమాదం ఉంటుంది. అలాగే ఈ రోజుల్లో మధుమేహంతో బాధపడేవారు చాలా మంది ఉన్నారు. మధుమేహం ఉన్నవారికి కొలెస్ట్రాల్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి అంటే వారు ఉదయాన్నే తులసి ఆకులను నమలడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. ఇది డయాబెటిస్ వారికి ఎంతో మేలు చేస్తుంది. ఇక నోటి దుర్వాసనతో బాధపడేవారు తులసి ఆకులు ఎంతగానో మేలు చేస్తాయి. నోటి దుర్వాసన, చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి నోటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి ఆకులను తినడం వల్ల రోగ నిరోధశక్తి పెరుగుతుంది. దీంతో మీరు అనేక తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, వ్యాధుల బారిన పడకుండా నివారించవచ్చు. అంతేకాకుండా మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుంది. తులసి ఆకులను నమలడం వల్ల మూత్రపిండాల పనితీరు సైతం మెరుగు పడుతుంది. కిడ్నీ సంబంధిత సమస్యల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. అలాగే రక్తం శుద్ధి అవుతుంది. ఇది మొటిమలు, మొటిమల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

# బెండకాయ వల్ల కలిగే ప్రయోజనాలు



మన వంటింట్లో దొరికే కూరగాయలలో బెండకాయ కూడా ఒకటి. బెండకాయ వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. కొందరు బెండకాయ నువ్వు ఇష్టంగా తింటే మరికొందరు తినడానికి కూడా ఇష్టపడరు. ఇక బెండకాయతో మనం ఎన్నో రకాల రెసిపీలు ట్రై చేస్తూనే ఉంటాం. ఈ బెండకాయలు మనకు సీజన్ తో సంబంధం లేకుండా అన్ని కాలాలలో విరివిగా లభిస్తూ ఉంటాయి. బెండకాయ తింటే మధుమేహం అదుపులో ఉండటంతో పాటు పలు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పోషకాలతో నిండిఉండే బెండ కాయలో ఫైబర్, విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. అంతేకాకుండా ఈ బెండకాయ వల్ల ఇంకా ఎన్నో రకాల అద్భుతమైన ప్రయోజనాలు కూడా ఉన్నాయి. వాటి గురించి తెలిస్తే తినకుండా అసలు ఉండలేరు. బెండకాయలో తక్కువ క్యాలరీలు ఉంటాయి. అలాగే ఫైబర్ అధికంగా ఉంటుంది. బెండకాయలో ఉండే గ్లైసెమిక్ రక్తంలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. బెండకాయలో ఉండే ప్రొటీన్ శరీరానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రొటీన్లు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. తగినంత ప్రొటీన్ తీసుకుంటే అది దీర్ఘకాలం మధుమేహ నియంత్రణకు ఉపకరిస్తుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. బెండకాయ తినడం ద్వారా శరీరంలోని ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గుతుందట. బెండకాయలోని ఫైబర్, పెక్టిన్ ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంతో కీలక పాత్ర పోషిస్తాయి. ఊబకాయంతో బాధపడే వారు తరుచుగా బెండకాయ తింటే మంచిదట. బెండకాయ తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుందట. బెండకాయలో క్యాన్సర్ తగ్గించే ఔషధ గుణాలు ఉంటాయట. బెండకాయలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ కారక ఫ్రీ రాడికల్స్‌కు వ్యతిరేకంగా పనిచేస్తాయి. బెండకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. గర్భంతో ఉన్న మహిళలకు ఫోలిక్ యాసిడ్ చాలా ముఖ్యమైన అంశం, బెండకాయలలో ఉండే ఫోలేట్ తల్లి, బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పలు అధ్యయనాలు వెల్లడయింది. బెండకాయ తింటే జీర్ణక్రియ శక్తి పెరుగుతుంది. బెండకాయ లోని తేమజిగురు వల్ల కొంచం తిన్న వెంటనే కడుపు నిండుతుందట. బెండకయ మూత్రవిసర్జనకారిగా పనిచేస్తుందట. బెండకాయ ఎక్కువగా తినే వ్యక్తులు హైడ్రేటెడ్ గా ఉండటానికి ఉపయోగపడుతుంది.

# స్థానిక వార్తలు

## కేటీఆర్‌పై కేసు

**వరంగల్ :** కొన్ని వారాలుగా బీఆర్ఎస్ నాయకులు న్యాయపరమైన చిక్కుల్లో పడుతున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితను మార్చి 16న ఈడీ అరెస్టు చేసింది. పది రోజుల కస్టడీ తర్వాత తిహార్ జైలుకు తరలించింది. తర్వాత బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ కేసీఆర్ మేనల్లుడు జోగినపల్లి సంతోష్‌రావుపైనా భూ ఆక్రమణ కేసు నమోదైంది. హైదరాబాద్‌లో అక్రమంగా భూమి కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీఆర్ తనయుడు కేటీఆర్‌పైనా కేసు నమోదైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కించపరిచేలా కేటీఆర్ వ్యాఖ్యలు చేశారని పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌రావు హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు మంత్రులు ఎక్కడికి వెళ్లినా విపక్షాలను అరెస్టు చేసేశారు. నిర్భందించేవారు. అక్రమంగా కేసులు పెట్టేవారు. ఇప్పుడు అదే పరిస్థితి రివర్స్ అయింది. ఇప్పుడు అవే కేసులను బీఆర్ఎస్ నేతలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో కేటీఆర్‌పై కేసు పెట్టారు. అయితే తనపై దాఖలైన ఈ కేసుపై కేటీఆర్ ఇంకా స్పందించలేదు. ఇదిలా ఉండగా, తెలంగాణలో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలూ కొనసాగుతున్నాయి. రోజు రోజుకూ బీఆర్ఎస్‌ను వీడేవారి సంఖ్య పెరుగుతుండడంతో ఆ పార్టీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రెస్‌మీట్లు పెట్టి మరీ పార్టీ వీడే నేతలపై ఆరోపణలు చేస్తున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అయితే పార్టీ వీడేవారంతా రాజకీయ వ్యభిచారులు అని పేర్కొన్నారు. పవర్ బ్రోకర్లుగా అభివర్ణించారు. కేటీఆర్ అయితే రంజిత్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డిపై విరుచుకుపడ్డారు. పార్టీ మారమని ఆస్కార్ రేంజ్‌లో నటించారని విమర్శించారు. 15 రోజులకే ప్లేటు ఫిరాయించారని ఆరోపించారు. కేసీఆర్ కూతురు జైలుకు వెళితే వారు మాత్రం ఇక ఇకలు, పకపకలతో పార్టీ మారారని మండిపడ్డారు. మళ్లీ తాము అధికారంలోకి వచ్చాక కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా పార్టీలోకి తీసుకోబోమన్నారు.

## ఎంపీ బరిలోకి 15 మంది సీఎంలు



**న్యూఢిల్లీ :** మూడోసారి అధికారంలోకి రావాలని బీజేపీ.. ఈసారి ఎలాగైనా అధికారాన్ని కాంగ్రెస్ కూటమి.. మొత్తానికి ఈ దఫా పార్లమెంట్ ఎన్నికలు రచ్చరచ్చలాగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదల నిమిషంలో ఆయా రాజకీయ పార్టీలు అభ్యర్థుల జాబితాను విడుదల చేశాయి. ఎన్నికల ప్రచారాన్ని కూడా ముమ్మరం చేశాయి. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ కూటముల నుంచి దాదాపు 15 మంది మాజీ ముఖ్యమంత్రులు పోటీ చేయబోతున్నారు. ఇందులో 12 మంది ఎన్డీఏ కూటమి నుంచి పోటీలో ఉన్నారు. మరో ముగ్గురు ఇండియా కూటమి నుంచి బరిలో నిలిచారు. ఈ ముఖ్యమంత్రుల జాబితాలో శివరాజ్ సింగ్ చౌహన్, సర్బానంద సోనోవాల్, జగదాంబికా పాల్ వంటి వారు ఉన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయబోయే మాజీ ముఖ్యమంత్రుల జాబితాలో.. అత్యంత సీనియర్ గా నేతగా మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ ఉన్నారు. ఈయన మధ్యప్రదేశ్ రాష్ట్రానికి 6,122 రోజులపాటు ముఖ్యమంత్రిగా పని చేశారు. ఈయన ఈసారి పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తున్నారు. త్రిపుర ముఖ్యమంత్రిగా బిప్లవ్ దేవ్, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రిగా త్రివేంద్ర సింగ్, హర్యానా ముఖ్యమంత్రిగా పనిచేసిన మనోహర్ లాల్ వంటి వారు స్థానికంగా ఉన్న వ్యతిరేకత, స్వపక్షంలో ఉన్న అసమ్మతి కారణంగా పదవులు వదులుకున్నారు. సొంత రాష్ట్ర రాజకీయాల నుంచి బయటికి వచ్చారు. వీరు కూడా ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. జార్ఖండ్ ముఖ్యమంత్రిగా అర్జున్ ముండా, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా రాజ్ నాథ్ సింగ్ సభలో మెజారిటీ నిరూపించుకోలేకపోయారు. ఫలితంగా ఆ రాష్ట్రాలలో రాష్ట్రపతి పాలన విధించాల్సి వచ్చింది. వీరు కూడా పార్లమెంటు ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. కర్ణాటక రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన జగదీష్ షెట్టర్, బసవరాజ్ బొమ్మై వంటి వారు తమ హయాంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పార్టీని విజయ పథంలో నడిపించలేకపోయారు. దీంతో వారు తమ పదవులను వదులుకున్నారు. వీరు కూడా పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ పడనున్నారు. ఇక కాంగ్రెస్ తరపున ముఖ్యమంత్రులుగా పని చేసిన దిగ్విజయ్ సింగ్, భూపేష్ సింగ్ బాఘెల్ ది కూడా అదే దుస్థితి. అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసిన నబంతుకి కూడా మెజారిటీ దక్కించుకోలేకపోయారు. ప్రభుత్వం కూలిపోవడంతో అక్కడ కూడా రాష్ట్రపతి పాలన వచ్చింది. రెండవసారి 2016 జూలై 13 నుంచి 16 వరకు ముఖ్యమంత్రిగా పని చేసిన పెమా ఖండు నేతృత్వంలోని 43 మంది ఎమ్మెల్యేలు వ్యతిరేక స్వరం వినిపించారు. భారతీయ జనతా పార్టీకి అనుబంధంగా ఉన్న పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్ ప్రదేశ్ గా మారారు. దీంతో ఆయన పదవి కోల్పోవాల్సి వచ్చింది. దీంతో ఆ రాష్ట్రంలో పెమా ఖండు నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయింది. సర్బానంద సోనోవాల్, బిప్లవ్ కుమార్, దిగ్విజయ్ సింగ్ ప్రస్తుతం రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. ఆయినప్పటికీ వారి పార్టీలు పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిపాయి. రాజ్ నాథ్ సింగ్, జగదాంబికా పాల్, అర్జున్ ముండా ప్రస్తుతం పార్లమెంట్ సభ్యులుగా ఉన్నప్పటికీ మరోసారి ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఇక మిగిలిన వారు ఎన్నికల్లో కొత్తగా వారి ప్రత్యర్థులతో తలపడుతున్నారు. మాజీ ప్రధాని దేవి గౌడ కుమారుడైన కుమారస్వామి ఒకసారి బీజేపీ, మరోసారి కాంగ్రెస్ పార్టీ మద్దతుతో కర్ణాటక ముఖ్యమంత్రిగా పని చేశారు. ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 2007లో బీజేపీ అధికారం ఇవ్వాల్సిన సమయంలో ఆయన తిరస్కరించి రాజీనామా చేశారు. దీంతో ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాల్సి వచ్చింది. 2018 లో ఆయన నేతృత్వంలోని జేడీఎస్ మూడో పార్టీగా అవతరించిన సమయంలో బీజేపీని అధికారానికి దూరంగా ఉంచాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీకి ఆయన సపోర్ట్ చేశారు. దీంతో ఆయన రెండోసారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. 2019 జూలై నెలలో 13 మంది కాంగ్రెస్, ముగ్గురు జేడీఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడంతో కుమారస్వామి మెజారిటీ కోల్పోయారు. ఫలితంగా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆయన పదవి నుంచి దిగిపోయిన వెంటనే యడ్యూరప్ప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కుమారస్వామి పార్టీ గ్రాఫ్ దారుణంగా పడిపోయింది. రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆయన ప్రస్తుతం ఎన్డీఏ కూటమిలో చేరారు. పొత్తులో భాగంగా కుమారస్వామి పార్టీకి మూడు స్థానాలు దక్కాయి. అందులో మాండ్య పార్లమెంటు స్థానం నుంచి కుమారస్వామి పోటీ చేస్తున్నారు. గతంలో ఈ స్థానం సిట్టింగ్ ఎంపీగా బిజెపి నేత, సినీనటి సుమలత ఉన్నారు. కుమారస్వామి వల్ల ఆమె ఈసారి అక్కడ నుంచి పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

**హైదరాబాద్ :** ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షేక్పేట ద్వారకామయి నగర్ లో మెయిన్ రోడ్డు వద్ద కరెంటు స్తంభాలకు ఉన్న వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో అగ్నిప్రమాద చోటుచేసుకుంది.. ద్వారక మెయిన్ రోడ్డు ఉన్న కరెంటు స్తంభాలకు వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతోనే అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. స్థానికులు గమనించి విద్యుత్ అధికారులకు తెలియజేయడంతో సుమారుగా రెండు గంటల పాటు కరెంటు నిలిచిపోయింది. స్థానిక ప్రజలు గమనించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు

## ఉద్యమకారులను విస్మరించి ద్రోహులకు పదవులా..?

**బిఆర్ఎస్ నాయకులు సురభి రమేష్ రావు**

**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** ఉద్యమ పార్టీగా 14 సంవత్సరాలు పోరాటాలు చేసి.. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత 10 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని ఏకచత్రాధిపత్యంగా పాలించిన బీఆర్ఎస్ పార్టీ కడియం శ్రీహరిని రాజకీయ నిరుద్యోగ ఉన్న వరంగల్ ఎంపీగా గెలిపించుకొని తర్వాత తెలంగాణ ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి మళ్లీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి స్టేషన్ ఘనపూర్ నుండి ఎమ్మెల్యే గెలిపించుకున్న తర్వాత నాలుగు మాటలు కాంగ్రెస్ ఇప్పుడు జంప్ అవుతున్నాడు ఇది న్యాయమా.. అలాగే కే.కేశవరావు గురించి కనీసం వార్డ్ మెంబర్ గెలవలేని మనిషి రెండుసార్ల రాజ్యసభ ఎంపీగా అవకాశం ఇచ్చాడు.. బిడ్డకి హైదరాబాద్ మేయర్ తెచ్చారు.. కనీసం ఇంగిత జ్ఞానం లేకుండా పార్టీలు మారుతున్నారు. వీరితోపాటు ఎంపీ రంజిత్ రెడ్డి, దానం నాగేందర్, సునీత మహేందర్ రెడ్డి అని ఆల్విన్ కాలనీ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సురభి రమేష్ రావు తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు సన్నిహితంగా ఉండే సీనియర్ నాయకులు కూడా పార్టీని వదిలి వెళ్లడం పట్ల తీవ్ర ఖండించిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సురభి రమేష్ రావు. శూన్యం నుండి సునామీ సృష్టించి, అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్రాన్నే సాధించిన ధీశాలి కేసీఆర్.. ఒక్కడుగా బయలుదేరి లక్షల మంది సైన్యాన్ని తయారు చేసి, ఎన్నో అవమానాలు, ద్రోహాలు, కుట్రలు, కుతంత్రాలు అన్నింటిని ఛేదించిన ధీరత్వం కేసీఆర్.. అలాంటి ధీరుడిని కొన్ని కప్పదాట్లు, ద్రోహపు ఎత్తుగడలతో దెబ్బ తీయాలనుకునే రాజకీయ బేహారులకు తెలంగాణ ప్రజలే జవాబు చెబుతారు. ప్రజా ఆశీర్వాదం, మద్దతుతో 14 ఏళ్లు పోరాడి, ఉద్యమ పార్టీగా తెలంగాణ సాధించి.. తెచ్చుకున్న తెలంగాణ దశను, దిశను మార్చి కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన కెసిఆర్ ను, బీఆర్ఎస్ పార్టీని ప్రజలే గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటారు. మొత్తానికి తెలంగాణను పదేళ్ల పాటు ఏలిన పార్టీ ఇప్పుడు ఉనికి కోసం పోరాడాల్సిన పరిస్థితులు రావడం కేసీఆర్ అండ్ కో జీర్ణించుకోలేకపోతున్నారు. ఉద్యమకారులను పక్కనపెట్టి ఉద్యమ ద్రోహులుగా ముద్రపడిన నాయకులను అక్కున చేర్చుకుని వాళ్లకి కేసీఆర్ కీలక పదవులు ఇచ్చారు అని సురభి రమేష్ రావు అన్నారు. శూన్యం నుండి సునామీ సృష్టించి, అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్రాన్నే సాధించిన ధీశాలి మన కెసిఆర్ ఒక్కడుగా బయలుదేరి లక్షల మంది సైన్యాన్ని తయారు చేసి, ఎన్నో అవమానాలు,



ద్రోహాలు, కుట్రలు, కుతంత్రాలు అన్నిటిని ఛేదించిన ధీరత్వం కెసిఆర్ అని సురభి రమేష్ రావు అని తెలిపారు.

## రంజాన్ తోపా పంపిణి చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హకీమ్

**వాస్తవ నేస్తం,కోటగిరి:** రంజాన్ పండగను పురస్కరించుకొని శనివారం పోతంగల్ మండల కేంద్రంలోని పాత పోతంగాల్ కు చెందిన 20 మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు ఉమ్మడి కోటగిరి మండల మాజీ కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.ఏ హకీమ్ ఆధ్వర్యంలో రంజాన్ పండగకు పవిత్ర మాసంలో నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు(రంజాన్ తోఫా) అందజేశారు. ఈ సందర్భంగా పోతంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల శంకర్ మాట్లాడుతూ.. జన్మనిచ్చిన గ్రామానికే కాకుండా చుట్టుప్రక్కల ఉన్న గ్రామాలలో కూడా ఎం.ఏ. హకీం చేస్తున్న పలు సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. ఈ రంజాన్ పండగ సందర్భంగా పాత పోతంగల్ కు చెందిన 20 మంది మైనార్టీ కుటుంబాలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేయడంలో మమ్మల్ని భాగస్వామ్యం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎం.ఏ హకీం మాట్లా డుతూ.. కోటగిరి,పోతంగల్ మండలాలలో



పలువురికి ఉపయుక్తమైన పలు సేవా కార్యక్రమాల్లకు తాను ముందు వరసలో ఉంటానన్నారు. తాను చేసే ప్రతి కార్యంలో ప్రతి ఒక్కరి సహకారం ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంధపు పవన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా.సజ్జద్, మండల మైనార్టీ సేల్ అధ్యక్షులు వాజిద్, నాయకులు గంధపు దత్తు, బాబా, దేవ్ సింగ్, మైనారిటీలు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసుపెద్ద చేపల కోసం వల

**హైదరాబాద్ :** తెలంగాణను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీస్ శాఖ మరో కీలక పరిణామానికి నాంది పలికింది. గత ప్రభుత్వంలో హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ విభాగానికి డీసీపీగా పనిచేసి, ఉద్యోగ విరమణ అనంతరం అక్కడే ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) గా పనిచేసిన రాధా కిషన్ రావు ను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు.. అంతకుముందు రాధా కిషన్ రావును బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్లో గేట్లు మొత్తం మూ సేసి ఆయనను విచారించారు. ఈ విచారణకు సంబంధించిన వివరాలు బయటకు రాకుండా పోలీసులు అత్యంత గోప్యత పాటించారు. మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఇచ్చిన సమాచారం ఆధారంగా రాధా కిషన్ రావును పోలీసులు పలు విషయాలపై విచారించారు. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం లో ప్రణీత్ రావు పోలీసుల అదుపులో ఉన్నాడు. అతడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా అదనపు ఎస్పీలు తిరుపతన్న, భుజంగరావు, మీడియా సంస్థ నిర్వాహకుడు శ్రవణ్ రావు నివాసాలలో పోలీసులు కొద్దిరోజుల క్రితం తనిఖీలు చేశారు. అయితే ఇప్పటికే భుజంగరావు, తిరుపతన్నను పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన వ్యక్తులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని తెలుస్తోంది. వీరిపై ఇప్పటికే పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. రాధా కిషన్ రావు ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆయన హయాంలో క్షేత్రస్థాయిలో చేపట్టిన ఆపరేషన్ల గురించి పోలీసులు సుదీర్ఘంగా విచారించారు. విదేశాల నుంచి పరికరాలు ఎవరు తెప్పించారు? ఎందుకోసం తెప్పించారు? దీని వెనక ఎవరున్నారు? ఎవరి ఆదేశాలతో ఈ పని చేశారు? ప్రణీత్ రావుతో ఎన్ని ఆపరేషన్లు చేయించారు? ఎంతమంది వ్యాపారులను బెదిరించారు? ఆ డబ్బు వసూలులో ఎవరు కీలకపాత్ర పోషించారు? ఆ డబ్బుతో ఏమేం చేశారు? వంటి అంశాల పై పోలీసులు రాధా కిషన్ రావును ప్రశ్నించారు. రాధా కిషన్ రావును ప్రశ్నించిన అనంతరం టాస్క్ ఫోర్స్, ఎస్ఐబీ లో ఇన్ స్పెక్టర్ గా పనిచేసిన గట్టు మల్లును కూడా పోలీసులు బంజర హిల్స్ పోలీస్ స్టేషన్ కు పిలిపించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పై అతడిని కూడా ప్రశ్నించారు..ఓ ఉన్నతాధికారి ఆయన స్టైల్ లో విచారించడంతో గట్టు మల్లు కీలక విషయాలు వెల్లడించినట్టు ప్రచారం జరుగుతున్నది. రాధా కిషన్ రావు హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ లో సుదీర్ఘకాలం పనిచేసినందు వల్ల ఆయన బృందం పరి తీరుపై ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం లక్ష్యంగా చేసుకున్న ప్రత్యర్థులను వీరు గారికి తెచ్చేవారని విమర్శలున్నాయి. రాధా కిషన్ రావు పై పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నారు రేవంత్ రెడ్డి పలు ఆరోపణలు చేశారు. రాధా కిషన్ రావు మల్కాజ్ గిరి ఏసీపీగా ఉన్నప్పుడు వేధింపులకు గురి చేయడంతో ఒక కాంగ్రెస్ నాయకుడు ఆత్మహత్య చేసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. విచారణ అనంతరం ఆయన ఆ కేతు నుంచి బయటపడ్డారు. రాధా కిషన్ రావు ఉద్యోగం నుంచి విరమణ పొందినప్పటికీ ఆయన టాస్క్ ఫోర్స్ విభాగంలో కీలకంగా పని చేశారు. నగర కమిషనర్ గా ఎవరున్నప్పటికీ.. ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండడంతో రాధా కిషన్ రావు కే అధిక ప్రాధాన్యం దక్కేది. రిటైర్మెంట్ అయినప్పటికీ ఆయన రెండుసార్లు ఓఎస్డీ గా పనిచేశారు. శాసనసభ ఎన్నికల సమయంలో రాధా కిషన్ రావు పై అప్పటి కమిషనర్ సందీప్ కుమార్ శాండిల్య ఎన్నికల కమిషనర్ కు ప్రత్యేక నివేదిక పంపించడంతో ఆయనను టాస్క్ ఫోర్స్ బాధ్యతల నుంచి తొలగించారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాధా కిషన్ రావు తన పదవికి రాజీనామా చేశారు. రాధా కిషన్ రావు, గట్టు మల్లును పోలీసులు విచారిస్తున్న క్రమంలో బేగం బజారుకు చెందిన కొంతమంది వర్తకులు అజ్ఞాతం లోకి వెళ్లిపోయారు. బేగంబజార్ ప్రాంతంలో హవాలా, గంజాయి దందా ఎక్కువగా సాగుతుంది. ఈ దందాలలో కీలకంగా ఉన్న వారితో రాధా కిషన్ రావు, గట్టుమల్లు ఆర్థిక లావాదేవీలు కొనసాగించారని ఆరోపణలు ఉన్నాయి. రాధా కిషన్ రావు మాత్రమే కాకుండా మరో ముగ్గురు టాస్క్ ఫోర్స్ పోలీసులను కూడా అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.. వారి ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని కూడా రహస్యంగా విచారిస్తున్నట్టు సమాచారం. ప్రణీత్ రావుకు డ్రైవర్ గా పనిచేసిన వ్యక్తితో పాటు ఒక కానిస్టేబుల్ కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత ఏడాది డిసెంబర్ 4న ఎస్ఐబీలో హార్డ్ డిస్క్ లను ధ్వంసం చేసి.. వాటిని మూసి నదిలో పారేసినట్టు సమాచారం. ఆ ఘటనలో వీరి ప్రమేయం ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో అరెస్టయి చంచల్గూడా జైల్లో ఉన్న భుజంగరావు, తిరుపతన్నను ఐదు రోజులపాటు పోలీసు కస్టడీకి ఇస్తూ నాంపల్లి కోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం నుంచి ఏప్రిల్ 2 వరకు వారు పోలీస్ కస్టడీలో ఉంటారు. అయితే ప్రణీత్ రావును పోలీస్ కస్టడీకి ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది.



# పవన్ కల్యాణ్ బ్లాక్ బస్టర్ టైటిల్‌తో వస్తున్న నితిన్..

టాలీవుడ్ హీరో నితిన్ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా అభిమానులతో పాటు సినీ ప్రముఖులు నితిన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అయితే నితిన్ బర్త్ డే సందర్భంగా తాను నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ నుంచి టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమా తమ్ముడు అనే టైటిల్‌తో వస్తుండగా.. ఈ చిత్రానికి 'వకీల్ సాబ్' ఫేమ్ వేణు శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇక తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్ లోగో విడుదలైంది. ఇక ఈ పోస్టర్‌లో నితిన్ మాస్ లుక్‌లో అదరగొడుతున్నాడు. ఇక ఈ పోస్టర్ గమనిస్తే.. నితిన్ బస్‌పై కూర్చొని సుబ్రమణ్య స్వామి ఆయుధం పట్టుకుని కనిపిస్తున్నాడు. ఇక నితిన్ గత చిత్రాలకు భిన్నంగా.. చాలా క్రియేటివ్‌గా ఇ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కాంతార, విరూపాక్ష చిత్రాల సంగీత దర్శకుడు అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తుండగా.. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నాడు.






# నాకు అలాంటి మొగుడు కావాలి

మోస్ట్ బ్యూటిఫుల్ నటీమని అనన్య నాగళ్ళ గురించి ప్రత్యేకంగా తెలుగు సినీ ప్రేమికులకు పరిచయం అవసరం లేదు. ఈమె ప్రియదర్శి ప్రధాన పాత్రలో రూపొందిన మల్లేశం అనే మూవీ తో తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ఈ సినిమా మంచి విజయం సాధించింది. అలాగే ఇందులో ఈమె పద్ధతి గల అమ్మాయి పాత్రలో ఓ మధ్య తరగతి భర్తకు భార్య పాత్రలో నటించి తన నటనతో ఎంతో మంది ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక ఆ తర్వాత ఈమెకు వరుసగా తెలుగు సినిమాలలో అవకాశాలు దక్కాయి. అందులో భాగంగా ఈమె మల్లేశం సినిమా తర్వాత కూడా చాలా క్లాస్ అండ్ డీసెంట్ పాత్రలలో నటిస్తూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇకపోతే సినిమా లలో చాలా పద్ధతి గల పాత్రల్లో నటిస్తున్న ఈమె సోషల్ మీడియాలో మాత్రం అందుకు పూర్తి వ్యతిరేకంగా ఉంటూ తన హాట్ స్కిన్ షో తో కూడిన ఫోటోలను ఎప్పటికప్పుడు తన సోషల్ మీడియా అకౌంట్ లో పోస్ట్ చేస్తూ వస్తుంది. ఇలా సినిమాల్లో పద్ధతి గల అమ్మాయి పాత్రలో నటిస్తున్న ఈమె సోషల్ మీడియాలో మాత్రం తన అందాలను భారీగా ఆరబోస్తూ కుర్రకారు ప్రేక్షకులకు ఫుల్ కిక్ నీ ఎక్కిస్తుంది. ఇది ఇలా ఉంటే ఈ ముద్దు గుమ్మ ప్రస్తుతం కూడా అనేక సినిమాలలో నటిస్తోంది. అందులో చాలా విడుదల కూడా అవుతున్నాయి. కానీ వాటికి మంచి గుర్తింపు రావడం లేదు. ఇకపోతే తాజాగా ఈమె ఓ ఇంటర్వ్యూ లో పాల్గొంది. ఆ ఇంటర్వ్యూ లో భాగంగా అనన్య తనకు కావలసిన మొగుడికి ఎలాంటి క్వాలిటీస్ ఉండాలో చెప్పుకొచ్చింది. అనన్య తాజాగా మాట్లాడుతూ ... నాకు కాబోయే భర్త హాయ్ నాన్న సినిమాలో నాని గారిలా ఉండాలి అని ... అలా ఉంటే నేను అతనికి ఓకే చెప్పేస్తాను అని ఈ బ్యూటీ చెప్పుకొచ్చింది.



# ఐదు భాషల్లో మంచు లక్ష్మీ 'ఆదిపర్వం'

మంచు లక్ష్మీ ప్రధాన పాత్రలో నటించిన సోషియో ఫాంటసీ ఫిలీం 'ఆదిపర్వం'. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో... రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్వికా ఆర్ట్స్-ఎ.ఐ ఎంటర్టైన్మెంట్స్ సంయుక్త నిర్మాణంలో ఐదు భాషల్లో ఈ సినిమా రూపుదిద్దుకుంది. 1974 నుంచి 1992 మధ్య జరిగే పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కి... ఇటీవల ఐదు భాషల్లోనూ విడుదలైన ట్రైలర్ కు విశేష స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకులు సంజీవ్ కుమార్ మేగోటి మాట్లాడుతూ... 'ఆదిపర్వం' ప్రచార చిత్రానికి లభిస్తున్న అనూహ్య స్పందన... ఈ చిత్రం కోసం మేము పడిన కఠోర శ్రమ మర్చిపోయేలా చేసింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు దాదాపుగా పూర్తి కావచ్చాయి. త్వరలో సెన్సార్ కు వెళ్లనున్నాం. బహు భాషల్లో రూపొందిన ఈ చిత్రం ఇంత బాగా రావడానికి మాకు సహకరించిన మా ఫైర్ బ్రాండ్ మంచు లక్ష్మి గారికి స్పెషల్ థాంక్స్" అన్నారు. ఈ చిత్రంలో మంచులక్ష్మీతో పాటు శివకంఠంనేని , ఆదిత్య ఓం, ఎస్తర్ నోరోనా, శ్రీజిత ఘోష్, వెంకట్ కిరణ్, సత్యప్రకాష్, సుహాసిని, హ్యారీజోష్, సమ్మెట గాంధీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# త్రిశంకు స్వర్గంలో కల్కి నిర్ణయం

ప్రభాస్ హీరోగా నాగ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న కల్కి 2898 ఏడి విడుదల తేదీ విషయంలో సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఎన్నికల నేపథ్యంలో మే 9 వద్దని డిస్ట్రిబ్యూటర్లు, సన్నిహితులు వారిస్తుండటంతో నిర్మాత అశ్విన్ దత్ పునరాలోచనలో పడిన మాట వాస్తవమే. ఇంకా ఫస్ట్ కాపీ సిద్ధం కాలేదు. వారం పైగా కీలక భాగం పెండింగ్ ఉందట. అదవ్వగానే మిగిలిన పనులు వేగవంతం చేస్తారు. అసలు సమస్య అది కాదు. ఏ నిర్ణయం తీసుకోవాలనే దాని గురించి స్వప్న, ప్రియాంక దత్ లు చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. ఎలాంటి కంక్లూజన్ రావడం లేదట. సెంటిమెంట్ డేట్ కాబట్టి మే 9 వదులుకోకూడదనేది దత్తు గారి సంకల్పం. కానీ పరిస్థితులు దానికి అనుకూలంగా లేవు. ఒకవేళ పోస్టు పోన్ తప్పదు అనుకుంటే ఆ మరుసటి వారం వెళ్లాలా లేక జూన్, జూలైలను లక్ష్యంగా పెట్టుకోవాలానేది పెద్ద మీమాంస. పోనీ ఆగస్ట్ కు షిఫ్ట్ అవుదామా అంటే పుష్ప 2 ది రూల్ వచ్చి తీరుతుందని మైత్రి మేకర్స్, దర్శకుడు సుకుమార్ సంకేతాలు పంపిస్తునే ఉన్నారు. సో ఆ ఛాన్స్ లేదు. సెప్టెంబర్ అంటే మరీ లేట్ అవుతుంది. అది కూడా రెండు వారాల లోపే జరగాలి. లేదంటే ఓజి, దేవర, గేమ్ ఛేంజర్ లు వరసగా షెడ్యూల్ చేసుకుని పెట్టారు. సో ఈ అయోమయం తీరాలంటే ఇంకొద్ది రోజులు ఎదురు చూడక తప్పేలా లేదు. డిజిటల్ రైట్స్ ని మూడు వందల కోట్లకు పైగా అమ్మారనే టాక్ కూడా నిజం కాదట. ఓటిటి డీల్ కు సంబంధించి ఎలాంటి ఒప్పందాలు ఇంకా జరగలేదని తెలిసింది. టీజర్ వచ్చాకే మాట్లాడదామని అనుకున్నట్టు సమాచారం. సలార్ పార్ట్ 1 సీజ్ ఫైర్ వచ్చిన ఆరు నెలల లోపే ఇంకో ప్రభాస్ సినిమా చూస్తామన్న అభిమానుల ఆనందం అంత సులభంగా నెరవేరేలా లేదు. ఏ నిర్ణయమైనా వీలైనంత త్వరగా తీసుకోవాలి. వాయిదాల విషయంలో సలార్ లాగా ఇతర ఇండియా రిలీజులకు ఇబ్బంది కలక్కుండా చూడాలి.

# నటుడు డేనియల్ బాలాజీ కన్నుమూత!



తమిళ నటుడు డేనియల్ బాలాజీ (48) కన్నుమూశారు. శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచారు. ఛాతినొప్పితో తీవ్ర అస్వస్థతకు గురైన డేనియల్ బాలాజీని కుటుంబసభ్యులు చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు .హాస్పిటల్‌కు చేరుకునేలోపే అతడు మరణించినట్లు వైద్యులు వెల్లడించినట్లు సమాచారం.డేనియల్ బాలాజీ తమిళంతో పాటు తెలుగు, మలయాళం మరియు కన్నడలో పలు సినిమాలు చేసి మెప్పించారు.తన కెరీర్ లో ఆయన ఎక్కువగా విలన్ రోల్స్‌లోనే కనిపించారు. చిట్టి అనే తమిళ సీరియల్‌తో డేనియల్ బాలాజీ యాక్టింగ్ కెరీర్ మొదలైంది. పిన్ని పేరుతో తెలుగులో డబ్ అయిన ఈ సీరియల్ బాగా పాపులర్ అయ్యింది. ఆ తర్వాత ఏప్రిల్ మదాతిల్ మరియు కాదల్ కొండెన్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలలో నటించాడు.. విశ్వనటుడు కమల్‌హాసన్ స్టార్ డైరెక్టర్ గౌతమ్ మీనన్ కాంబినేషన్ లో వచ్చిన వెట్టైయాడు విలయాడు మూవీలో డేనియల్ బాలాజీ సైకో క్యారెక్టర్‌లో కనిపించి తన విలనిజంతో ప్రేక్షకులను ఎంతగానో భయపెట్టారు .ఈ సినిమా తెలుగులో రాఘవన్ గా డబ్ అయి ఇక్కడ కూడా మంచి విజయం సాధించింది. ఈ మూవీ నటుడి గా అతడికి మంచి పేరు తెచ్చిపెట్టింది. ఆ తర్వాత తమిళంలో పొల్లవదన్, జ్ఞానకిరుక్కన్, అచ్చం యెన్‌బదు మదమైయదా, వడాచెన్నై మరియు బిగిల్‌తో పాటు తమిళంలో చాలా సినిమాల్లో నెగెటివ్ షేడ్స్ పాత్రల్లో కనిపించి మెప్పించాడు.డేనియల్ బాలాజీ చివరగా గత ఏడాది అరియవాన్ అనే తమిళ సినిమాలో కనిపించాడు.. ఎన్టీఆర్ సాంబ సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన డేనియల్ బాలాజీ ఆ తర్వాత వెంకటేష్ ఘర్షణ మూవీ లో హీరో ఫ్రెండ్స్ గ్యాంగ్‌లో ఒకరిగా కనిపించి మెప్పించాడు.



Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com